




రిజిస్ట్రేషన్ శాఖలో భారీగా అవకతవకలు జరుగుతున్నాయి. ఈ విషయాన్ని కాగ్ ముందుగా పసిగట్టి హెచ్చరించినా అధికారుల్లో మార్పు రావడం లేదు. చేసిన తప్పులనే మళ్లీ మళ్లీ చేస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. అయినా, పట్టించుకునే వారే కరువయ్యారు. సుంకాలు, రుసుముల్లో భారీగా తేడాలు కనిపిస్తున్నాయి. ఇంత జరుగుతున్నా, రిజిస్ట్రార్లు చూసీ చూడనట్టుగా వ్యవహరిస్తున్నారు. దీంతో అధికారులు ఉద్దేశపూర్వకంగానే అవకతవకలకు పాల్పడుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

- సుంకాలు, రిజిస్ట్రేషన్ రుసుముల లెక్కింపులో తేడాలు
- పదే పదే అవే తప్పులు... ఉద్దేశపూర్వకంగా పన్ను ఎగవేతలు
- చూసీచూడనట్టుగా వ్యవహరిస్తున్న రిజిస్ట్రార్లు
- సర్కార్ ఆదాయానికి ఏటా రూ. కోట్లలో గండి
- రిజిస్ట్రేషన్ శాఖ అధికారుల తీరుపై 'కాగ్' ఆక్షేపణలు

సుంకాలకు సున్నం!

రిజిస్ట్రార్ కార్యాలయాల్లో భారీగా అవకతవకలు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

ఒకసారి చేస్తే పొరపాటు... మరోసారి చేస్తే తప్పు... పదే పదే అలాంటి తప్పులు చేస్తే ఏమనాలి? ఉద్దేశపూర్వకంగానే చేశారనుకోవాలా? మళ్లీ అదే పొరపాటు చేశారనుకోవాలా?. జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాలతో పాటు పలు రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సుంకాలు, రిజిస్ట్రేషన్ రుసుములు వసూల విషయంలో భారీగా అవకతవకలు జరుగుతున్నాయి. ప్రతి ఏటా ఇలాంటి వాటిని వెలుగులోకి తీసుకువచ్చి 'కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్)' హెచ్చరించినా రిజిస్ట్రేషన్ శాఖలో ఎలాంటి మార్పూ కనిపించడం లేదు. దీంతో ప్రతి ఏటా ఉమ్మడి జిల్లాలో రూ. కోట్లాది రూపాయల ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. 2019 నుంచి 2023 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన 'రాష్ట్ర ఆర్థిక స్థితిగతుల'పై 'కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్)' ఇచ్చిన నివేదికను ప్రభుత్వం ఇటీవల శాసనసభలో ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. వివిధ ప్రభుత్వ శాఖల్లో జరిగిన అవకతవకలను బట్టబయలు చేసిన కాగ్ కొన్ని శాఖల తీరును తీవ్రంగా ఆక్షేపించింది. దస్తావేజులపై తక్కువ సుంకాలు విధించడం, వ్యవసాయేతర భూములకు వ్యవసాయ భూముల విలువ లెక్కించడం.. దస్తావేజుల్లో ఆస్తుల విలువ తగ్గించి సుంకాలు, రిజిస్ట్రేషన్ రుసుములు వసూలు చేయడం దాదాపు శివార్లలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనూ జరుగుతోంది. దీనివల్ల ప్రభుత్వానికి ఉమ్మడి జిల్లాలో ఏటా రూ. కోట్ల ఆదాయానికి గండి పడుతోంది. కొందరు సబ్ రిజిస్ట్రార్లు ఉద్దేశపూర్వకంగానే ఇలాంటి తప్పులు చేస్తూ ప్రైవేటు వ్యక్తులకు మేలు చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. గతంలో అనేకసార్లు హెచ్చరించినా ఈ తప్పులు జరగడం చూస్తే శాఖాపరంగా సరైన తనిఖీలు జరగకపోవడమేనని 'కాగ్' ఆక్షేపించింది. కాగ్ తనిఖీల్లో బయటపడిన కొన్ని అక్రమాలు, అవకతవకలు ఇలా ఉన్నాయి.

దస్తావేజులపై తక్కువ సుంకాలు

జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాలతో పాటు పలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో దస్తావేజులపై నిబంధనలకు విరుద్ధంగా తక్కువ సుంకాలు వసూలు చేస్తున్నారు. రంగారెడ్డి జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంతో పాటు చేవెళ్ల, కీసర, కుత్బుల్లాపూర్, శామీర్‌పేట, శంకరపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, హైదరాబాద్ జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాల్లో 2019-2022కు సంబంధించిన 13 డాక్యుమెంట్లను పరిశీలించిన కాగ్ అధికారులు పలు అవకతవకలను గుర్తించారు. 13 దస్తావేజులపై తక్కువగా సుంకాలు వసూలు చేయడం వల్ల ప్రభుత్వానికి రూ.8.89కోట్ల నష్టం జరిగింది. ఇందులో ఉమ్మడి జిల్లాలోనే అధికంగా నష్టం జరిగింది. ఈ కార్యాలయాల్లో గతంలో కూడా ఈ తప్పులు జరిగాయని, హెచ్చరించినప్పటికీ మళ్లీ ఇప్పుడు అవే తప్పులు పునరావృతమైనట్లు కాగ్ అభ్యంతరాలు వ్యక్తం చేసింది. ఈ కార్యాలయాలపై సరైన అంతర్గత తనిఖీలు లేనందునే అదే తప్పులు మళ్లీ మళ్లీ అవే అవతవకలు జరుగుతున్నాయని కాగ్ ఆక్షేపించింది. అలాగే వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్చిన తరువాత ఉద్దేశపూర్వకంగా వీటి విలువను తగ్గించి వాటిపై సుంకాలు, రిజిస్ట్రేషన్ రుసుము వసూలు చేస్తున్నారు. రాష్ట్రంలో 20చోట్ల తనిఖీలు నిర్వహించగా ఇందులో అధికంగా ఉమ్మడి జిల్లాలోనే ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో మచ్చుకు రంగారెడ్డి జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం, చేవెళ్ల, కీసర, కుత్బుల్లాపూర్, శామీర్‌పేట, శంకరపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కొన్ని దస్తావేజులు పరిశీలించగా ఈ విషయాలు బయటపడ్డాయి. మొత్తం రూ.29.46కోట్ల విలువ లెక్కించాల్సి ఉండగా రూ.6.64కోట్లుగా లెక్కించారు. ఇలా చేయడం వల్ల ప్రభుత్వానికి స్టాంప్ డ్యూటీ తగ్గి రూ.1.36 కోట్ల నష్టం జరిగింది. దీనిపై వివరణ కోరగా ఆర్డీఓ కార్యాలయం నుంచి మార్పిడి ఉత్తర్వులు అందనందున వ్యవసాయ భూములుగా పరిగణించి సుంకాలు తీసుకున్నామని తెలిపారు. అయితే రెవెన్యూ అధికారుల నుంచి సమాచారం తీసుకునే విషయంలో నిర్లక్ష్యం కనిపిస్తోందని కాగ్ పేర్కొంది. ఇలా అధికారులు సమాధానం ఇవ్వడం కూడా అంగీకారం కాదని కాగ్ అభ్యంతరం తెలిపింది. 2022లో వీటిపై వివరణ కోరితే కొందరు అధికారుల నుంచి ఇంకా సమాధానం రాలేదని తెలిపింది.

ఆస్తుల విలువ తగ్గించి..

CAG

మేడ్చల్ జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంతో పాటు మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం, ఫరూఖ్‌నగర్, ఇబ్రహీంపట్నం,. కీసర, పరిగి, పెద్ద అంబర్‌పేట, శామీర్‌పేట బాలానగర్, కూకట్‌పల్లి, మల్కాజిగిరి, శేరిలింగంపల్లి, తాండూరులలో రిజిస్టరైన దస్తావేజుల్లో ఆస్తుల విలువ తక్కువగా లెక్కించి సుంకాలు, రిజిస్ట్రేషన్ రుసుములు తక్కువ వసూలు చేశారు. 2019 ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ 2021 మధ్యకాలంలో 22 కేసులను పరిశీలించగా ప్రభుత్వ ఆదాయానికి రూ.1.14 కోట్ల నష్టం జరిగింది. దీనిపై 2023 ఫిబ్రవరిలో వివరణ కోరగా సమాధానమిస్తామని చెప్పినా ఇంత వరకు సమాధానం రాలేదు. గతంలో కూడా మేడ్చల్ జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంతో పాటు బాలానగర్, ఇబ్రహీంపట్నం, శేరిలింగంపలి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇదే విధంగా అవకతవకలు జరిగినా ఇంకా పునరావృతమవుతున్నాయని కాగ్ వెల్లడించింది.



కౌలు దస్తావేజులపై తక్కువ రుసుము

జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో 2020 నవంబర్‌కు సంబంధించిన రెండు కౌలు దస్తావేజులు పరిశీలించగా వీటికి సుంకాలు తక్కువ వసూలు చేసినట్లు తేలింది. సాధారణంగా 5 నుంచి 10 సంవత్సరాల కౌలుకు సంబంధించిన దస్తావేజులపై వార్షిక అద్దెలో 2శాతం చొప్పున స్టాంప్ డ్యూటీ విధించాలి. కానీ సుంకాలను తప్పుగా లెక్కించి రూ.5.32లక్షల సుంకాలను తక్కువ వసూలు చేశారు.

డీజీపీఏ దరఖాస్తుల్లోనూ ఇలానే..

డీజీపీఏ దస్తావేజుల్లోనూ అవకతవకలు బయటపడ్డాయి. రంగారెడ్డి జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంతో పాటు ఎల్‌బీనగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 2019 జనవరి నుంచి 2020 జనవరి వరకు మచ్చుకు మూడు దరఖాస్తులను పరిశీలించగా డీజీపీఏ దస్తావేజులకు రూ.4.56లక్షల సుంకాలు తక్కువ విధించినట్లు తేలింది. దస్తావేజుల్లో నిర్మాణం కోసం ప్రతిపాదించిన మొత్తాన్ని తక్కువగా చూపడం, రిజిస్టరైన ఆస్తులకు మునుపటి అధిక విలువను పరిగణలోకి తీసుకోకపోవడాన్ని కాగ్ అధికారులు గుర్తించారు. దీనిపై వివరణ కోరగా ఇంతవరకు సమాధానం రాలేదు. రంగారెడ్డి జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో పదే పదే ఈ తప్పులు జరుగుతున్నాయని గతంలో కూడానే జరిగితే హెచ్చరించామని అయినా, ఇంకా ఇదే ధోరణి కొనసాగుతుందని ఆక్షేపించింది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ మార్కెట్ విలువ ప్రకారం కాకుండా తక్కువ సుంకాలు వసూలు చేశారు. రంగారెడ్డి జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంతో పాటు చేవెళ్ల, మహేశ్వరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 2021 ఫిబ్రవరి 2021 ఆగస్టు మధ్య కొన్ని దరఖాస్తులను పరిశీలించగా రూ.81లక్షల తక్కువ సుంకాలు విధించారు. పారిపాసు పద్ధతిన రూపొందించిన దరఖాస్తులకు 0.5 శాతం రిజిస్ట్రేషన్ రుసుము వసూలు చేయాలి. 2021 జూలై, ఆగస్టులో జరిగిన ఈ రుణ తనఖా పారిపాసు దస్తావేజులు పరిశీలించగా 0.5శాతం కాకుండా రూ.పది వేల చొప్పున సుంకం వసూలు చేశారు. హైదరాబాద్ జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంతో వరంగల్ జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం, మహేశ్వరం సబ్ రిజిస్ట్రార్ కారాల్యయంలో తనిఖీ చేయగా రూ.136.85కోట్ల రుణానికి రూ. 68.03 లక్షలు తక్కువ వసూలు చేశారు. రంగారెడ్డి జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం, ఎల్‌బీనగర్, మహేశ్వరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో దస్తావేజులు తక్కువగా వర్గీకరించడం వల్ల ప్రభుత్వానికి నష్టం జరిగింది. 2021 జూలై 2021 సెప్టెంబర్ మధ్యకాలంలో 13 దస్తావేజులు తప్పుగా వర్గీకరించడం వల్ల రూ.26.50లక్షలు ప్రభుత్వ ఆదాయానికి గండి పడింది.

షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మున్సిపల్ కార్మికులు

'స్వచ్ఛదనం-పచ్చదనం'లో అపశ్రుతి

- మున్సిపల్ కార్మికులకు ఫుడ్ పాయిజన్
- చికిత్స కోసం ఆస్పత్రికి తరలింపు
- షాద్‌నగర్‌లో ఘటన

షాద్‌నగర్, ఆగస్టు 6: ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో అపశ్రుతి చోటు చేసుకుంది. షాద్‌నగర్‌లో మున్సిపల్ అధికారులు తెప్పించిన భోజనం తిని పదిమంది కార్మికులు అస్వస్థకు గురయ్యారు. వారిని పట్టణంలోని కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించి వైద్యం చేయిస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. స్వచ్ఛదనం-పచ్చదనం, పారిశుధ్యం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నందున రోజంతా కార్మికులను అందుబాటులో ఉండాలని అధికారులు ఆదేశించారు. వారికి పట్టణంలోని ఒక క్యాటరింగ్ నుంచి మధ్యాహ్న భోజనం తెప్పిస్తున్నారు. మంగళవారం క్యాటరింగ్ నిర్వాహకులు 100మంది కార్మికులకు భోజనం తెచ్చారు. అన్నం తిన్న కొద్ది సేపటికి కార్మికులు కె.యాదమ్మ, ఎ.యాదమ్మ, టి.యాదమ్మ, సువర్ణ, కమలమ్మ, పద్మ, భారతి, మరో ముగ్గురు వాంతులు చేసులు చేసుకున్నారు. ఈ విషయాన్ని తోటి కార్మికులు అధికారులకు తెలపడంతో సిబ్బందితో వారిని షాద్‌నగర్ పట్టణంలోని కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స చేశారు. అయితే క్యాటరింగ్ భోజనం వల్ల వారికి ఫుడ్ పాయిజన్ అయిందా? లేక కార్మికులు చేతులు శుభ్రం కడుక్కోక అన్నం తిన్నారా? అనే విషయంలో ఆరా తీస్తున్నారు. ఫుడ్ శాంపిల్‌ను ల్యాబ్‌కు తరలించారు. అయితే ఫుడ్ పాయిజన్‌కు గల కారణాలపై విచారణ చేస్తున్నామని కమిషనర్ వెంకన్న తెలిపారు. వంద మందికి పైగా కార్మికులకు భోజనం అందించామని, వారిలో ఏడుగురికి ఫుడ్ పాయిజన్ అయిందన్నారు. కొందరు కార్మికులు ఉదయం నుంచి కాలనీల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లారని, వారు చేతులను సరిగ్గా కడుక్కోక అనారోగ్యం తలెత్తిందా? అనే విషయంలో వివరాలు సేకరిస్తున్నామన్నారు. అస్వస్థకు గురైన కార్మికులంతా కోలుకున్నారని ఆయన తెలిపారు.



కార్మికులకు వడ్డించిన భోజనం



షాబాద్‌లో మొక్కకు నీరు పోస్తున్న ప్రతిమా సింగ్

'స్వచ్ఛదనం-పచ్చదనం'ను పకడ్బందీగా నిర్వహించాలి

షాబాద్, ఆగస్టు 6 : స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. మంగళవారం షాబాద్, సర్దార్‌నగర్ గ్రామాల్లో ఆమె పర్యటించారు. ఓహెచ్ఎస్ఆర్‌లోని నీటి పరీక్షలను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రజలకు తడి, పొడిచెత్తపై అవగాహన కల్పించి వేర్వేరుగా నిల్వ చేసేలా చూడాలన్నారు. ఖాళీ ప్రదేశాల్లో మొక్కలను నాటాలన్నారు. ఆమె వెంట ఎంపీడీవో అపర్ణ, ఎంపీవో శ్రీనివాస్, ఏపీవో వీరాసింగ్, ఏపీఎం నర్సింహులు తదితరులు ఉన్నారు.

సమ్మె.. సైరన్..!

- రేపటి నుంచి కదం తొక్కనున్న పంచాయతీ కార్మికులు
- గ్రామం, మండల, జిల్లా పరిషత్‌ల ఎదుట ధర్నాలు

యాచారం, ఆగస్టు 6 : ప్రభుత్వంతో అమీ తుమీ తేల్చుకునేందుకు పంచాయతీ కార్మికులు సిద్ధమయ్యారు. తమ సమస్యలను పరిష్కరించాలని కదం తొక్కనున్నారు. అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రేపటి నుంచి సమ్మెబాట పట్టనున్నారు. ప్రభుత్వం దిగి వచ్చి సమస్యలు పరిష్కరించకుంటే.. నిరవధిక సమ్మెకు దిగేందుకూ రంగం సిద్ధం చేసుకున్నారు. సమ్మె సైరన్‌కు సంబంధించి ఇప్పటికే గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం నాయకులు ఉన్నత స్థాయి అధికారులకు సమ్మె నోటీసును అందించారు. జిల్లాలో 558 పంచాయతీలు ఉన్నాయి. వాటిలో సుమారుగా 4,650 మంది కార్మికులు పనిచేస్తున్నారు. అయితే, తమకు శ్రమకు తగ్గ ఫలితం దక్కడం లేదని వారంతా ఆందోళన చెందుతున్నారు. పంచాయతీ కార్మికులు దుర్వాసన భరిస్తూ పనులు చేస్తున్నారు. చెత్తచెదారం తీసి ట్రాక్టర్‌లో వేసే సమయంలో, వీధులను శుభ్రం చేస్తున్న సమయంలో దుమ్ముధూళితో రోగాల బారిన పడుతున్నారు. దుర్గంధం ఎత్తిపోసి రోగాల బారిన పడుతున్నా.. ప్రజా ప్రతినిధులు కానీ.. అధికారులు కానీ పట్టించుకోవడం లేదని కార్మికులు ఆరోపిస్తున్నారు. పని సమయంలో కనీస సౌకర్యాలు కూడా కల్పించడం లేదని వాపోతున్నారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుతున్నా తమకు శ్రమకు తగ్గ ఫలితం అందడం లేదంటున్నారు. పంచాయతీలలో కార్మికులకు సరిపడా దుస్తులు ఇవ్వడం లేదని, చీపుర్లు కూడా తామే కొనాల్సిన పరిస్థితి వచ్చిందని వారు వాపోతున్నారు. కొన్ని సమయాల్లో కొబ్బరి మట్టలు తెచ్చుకుని చీపుర్లను తయారు చేసుకుంటున్నామని చెబుతున్నారు. పైప్‌లైన్లు పగిలితే అతికించడానికి పరికరాలను పంచాయతీ అధికారులు కార్మికులకు ఇప్పించ లేక పోతున్నారు. దీంతో తాగునీటి పైప్‌లైన్ మరమ్మత్తు చేయలేక కార్మికులు తంటాలు పడుతున్నారు. తట్టలు, పారలు, మినీ రిక్షాలు అందించాల్సి ఉన్నా కార్మికులకు పంపిణీ చేయడంలో అధికారులు విఫలమయ్యారు. విధి నిర్వహణలో మరణించిన కార్మికుల కుటుంబంలో ఒకరికి పంచాయతీ కార్మికులుగా చేర్చుకోవడంపై రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. నెలనెలా విధిగా వేతనాలందించాలని కోరారు. తమ సమస్యలపై ప్రభుత్వం, అధికారులు స్పందించకపోవడంతో రేపటి నుంచి సమ్మె బాట పడుతున్నట్టు పంచాయతీ కార్మికులు చెబుతున్నారు.


పంచాయతీ కార్మికుల డిమాండ్లు ఇవే..

పారిశుధ్య పనులు చేస్తున్న కార్మికులకు ఏడాదికి ఒకసారి కొబ్బరినూనె, సబ్బులు, చెప్పులు, జత దుస్తులు, నెలకోమారు మాస్కులు, ఏడాదికోమారు బూట్లు అందించాలి. పెండింగ్ బిల్లులు చెల్లించాలి. కార్మికులను రెగ్యులరైజ్ చేసి కనీస వేతన చట్టం ప్రకారంగా జీతాలందించాలని కోరుతున్నారు. 60 జీవోను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. కార్మికులు చనిపోయినప్పుడు వారి దహన సంస్కారాలకు రూ.10వేలకు బదులు రూ 30వేల ఆర్థికసాయమందించాలని కోరుతున్నారు. 51 జీవోను సవరించి మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. కార్మికులు విధి నిర్వహణలో మరణిస్తే రూ.10 లక్షల సాయమందించి ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. పంచాయతీ సిబ్బందికి పీఎఫ్, ఈఎస్ఐ గ్రాట్యుటీ, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని కోరుతున్నారు. జీవో 60 ప్రకారంగా వేతనాలందించాలని డిమాండ్ చేస్తున్నారు.



యాచారంలో చెత్త ఎత్తుతున్న కార్మికులు


ప్రతి నెలా జీతాలివ్వండి



మాకు నెలనెలా విధిగా వేతనలందించాలి. అధికారులు, నాయకులు, ప్రజాప్రతినిధులు మా గోడు విని సమస్యలు పరిష్కరించడం కోసం చొరవ తీసుకోవాలి. తమకు న్యాయం చేయాలని, న్యాయమైన డిమాండ్ల తీర్చాలని కోరుతూ ఈ నెల 8 నుంచి సమ్మెకు దిగుతున్నాం. ఇందుకు సంబంధించి రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ, గ్రామీణాభివృద్ధి కమిషనర్‌కు వినతిపత్రం అందించాం.

శ్రావణ్, కారోబార్, యాచారం

రూ. 5 లక్షల బీమా అమలు చేయాలి



ప్రతీ కార్మికుడికి రూ.5 లక్షల బీమా అందించాలి. ప్రభుత్వమే ప్రీమియం భరించాలి. పంచాయతీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించాలి. ఉచితంగా కార్పొరేట్ వైద్య సౌకర్యం కల్పించాలి. జనాభాకు అనుగుణంగా కార్మికులను నియమించాలి. విధిగా వేతనాలందించాలి. నాల్గో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలి.

అండాలు, చిన్నతూండ్ల, కార్మికురాలు

కొండ దిగిన కోడి

- అమాంతం పడిపోయిన చికెన్ ధరలు
- ఉమ్మడి జిల్లాలో స్కిన్‌లెస్ రేటు రూ.168
- అమ్మకాలపై శ్రావణ మాసం ఎఫెక్ట్
- మరింత తగ్గే అవకాశం ఉందంటున్న వ్యాపారులు

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 6 :ఉమ్మడి జిల్లాలో చికెన్ ధరలు అమాంతంగా పడిపోయాయి. గత వేసవి నుంచి జూలై వరకు కిలోకి రూ. 280 పలికిన చికెన్ ప్రస్తుతం రూ. 168కి చేరింది. ఇక స్కిన్‌తో అయితే రూ. 148కే లభిస్తుంది. శ్రావణ మాసం ఎఫెక్ట్‌తో ధరలు తగ్గగా.. చికెన్ ప్రియులకు పండుగలా మారింది. కానీ వ్యాపారులు మాత్రం డీలా పడిపోయారు. ధరలు పడిపోవడంతో కోళ్ల ఫారం యజమానులు గిట్టుబాటు కాకపోయినప్పటికీ వచ్చిన కాడికి విక్రయిస్తున్నారు. మూడు నెలల కిందటి నుంచి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రూ.280 నుంచి రూ.300 వరకు ఉండేది. శ్రావణ మాసం ఉండడంతో అమాంతంగా ధరలు తగ్గిపోయాయి. గత నెల 16న స్కిన్‌తో కేజీ చికెన్ రూ.191 ఉండగా స్కిన్ లేకుండా రూ.218 విక్రయించారు. ప్రస్తుతం స్కిన్‌తో ఉన్న చికెన్ రూ.148 ఉండగా, స్కిన్ లేకుండా రూ. 168కి అమ్ముతున్నారు. బేసిక్‌గా ఇది శ్రావణమాసంలో ఎక్కువమంది పూజలు, వ్రతాలతో మాంసాహారానికి దూరంగా ఉంటారు. దీనికి తోడు వర్షాకాలం కూడా తోడవ్వడంతో రేట్లు బాగానే తగ్గాయి. దీంతో కోళ్ల ఫారం యజమానులు తమ కోళ్లను దుకాణాలకు తక్కువ ధరకే విక్రయిస్తున్నా కొనే వారు లేరు. దీంతో కోళ్ల పెంపకందారులు, వ్యాపారస్తులు వ్యాపారాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. కోళ్లఫారం యజమానులు కోళ్లను పెంచిన తర్వాత నిర్ణీత సమయంలో విక్రయించకపోతే నష్టపోయే ప్రమాదం ఉండడంతో వాటిని వచ్చినకాడికి విక్రయిస్తున్నారు. శ్రావణ మాసం పూర్తయ్యే వరకు ఇటు వ్యాపారస్తులకు, అటు కోళ్ల పెంపకందారులకు గడ్డుకాలం ఉండనుండగా, చికెన్ ప్రియులకు మాత్రం చౌకగా లభించనుంది.

చికెన్ ధరల వివరాలు (కేజీకి రూపాయల్లో)

తేదీ	స్కిన్‌తో	స్కిన్ లేకుండా
	ఆగస్టులో	
06	148	168
03	158	180
01	168	191
	జూలైలో	
27	183	201
26	183	208
25	194	221
20	191	218
18	184	210
17	180	205
16	191	218

తగ్గని గుడ్డు ధర

చికెన్ ధరలు భారీగా పడిపోయినా గుడ్డు ధర మాత్రం తగ్గడం లేదు. బహిరంగ మార్కెట్‌లో ఒక్క గుడ్డును రూ.6కు పైనే అమ్ముతున్నారు. గతంలో రూ.4.50 ఉన్న ధర ఇప్పుడు రూ.6కు చేరుకుంది. మరో పక్క మటన్ ధరలు యథావిధిగా కొనసాగుతున్నాయి. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో కేజీ మటన్‌కు రూ. 750-1000 వరకు విక్రయిస్తున్నారు. మటన్ ధరలు ఇప్పట్లో తగ్గేలా కనిపించడం లేదు.



ప్రొఫెసర్ జయశంకర్ అడుగు జాడల్లో నడవాలి

- కలెక్టర్ శశాంక

రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 6 : యువత ప్రొఫెసర్ జయశంకర్ అడుగు జాడల్లో నడవాలని కలెక్టర్ శశాంక అన్నారు. మంగళవారం ప్రొఫెసర్ జయశంకర్ 90వ జయంతి వేడుకలను కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జయశంకర్ తెలంగాణ రాష్ట్రం కోసం తన జీవితాన్ని అంకితం చేశారని తెలిపారు. అధ్యాపకుడిగా ఆయన ఎంతోమందికి మార్గనిర్దేశం చేశారని, వృత్తిపట్ల నిబద్ధతను, తెలంగాణ ఉద్యమం పట్ల చిత్తశుద్ధిని నూరిపోశారన్నారు. ఆయన అడుగుజాడల్లో ప్రతీ ఒక్కరు నడవాలని కలెక్టర్ శశాంక సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఏవో నరసింహరావు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ శశాంక

అన్నదానం

శామీర్‌పేట, ఆగస్టు 6: స్థానిక శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. మచ్చందర్‌గౌడ్, రేవతి దంపతులు, శామీర్‌పేటకు చెందిన బండి శ్రీనివాస్‌గౌడ్, రాధ దంపతులు అన్నదానం చేశారు.

ఎస్సీ డిక్లరేషన్‌ను అమలు చేయాలి



తహసీల్దార్ గోపాల్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

కందుకూరు, ఆగస్టు 6:ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఎస్సీ డిక్లరేషన్ మేరకు ప్రతీ నిరుపేద ఎస్సీ కుటుంబానికి రూ.12లక్షల చొప్పున వెంటనే మంజూరు చేయాలని బీజేపీ దళితమోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు అల్వాల శేఖర్ డిమాండ్ చేశారు. మంగళవారం బీజేపీ మండల అధ్యక్షుడు అశోక్‌గౌడ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. శేఖర్ పాల్గొని మాట్లాడారు. ఎస్సీ కులాల కార్పొరేషన్లకు ఏడాదికి రూ.750కోట్లు కేటాయించాలన్నారు. ఇళ్ల నిర్మాణానికి రూ.5లక్షలు అందజేయాలన్నారు. ఈ మేరకు తహసీల్దార్ గోపాల్‌కు వినతిపత్రం ఇచ్చారు. మోర్చా జిల్లా కార్యదర్శి కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు పి.రాము, రఘునంధన్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి అంజిరెడ్డి, ఎన్.నర్సింహారెడ్డి, కె.సుధాకర్‌రెడ్డి, నారాయణరెడ్డి, పాండు, మల్లేష్, వి.మహేశ్, గణేష్, శ్రీశైలం, అశోక్, నర్సింహ, మైసయ్య, ఏసయ్య పాల్గొన్నారు.



యాదాద్రి పార్కులో పర్యటిస్తున్న అదనపు కలెక్టర్ రాధికా గుప్తా

విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

ఘట్‌కేసర్, ఆగస్టు 6: ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని మేడ్చల్-మల్కాజిగిరి అదనపు కలెక్టర్ రాధికా గుప్తా అన్నారు. పోచారం మున్సిపాలిటీ పరిధిలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మంగళవారం సాయంత్రం ఆమె పర్యటించారు. యంనంపేట్ ప్రాథమిక పాఠశాలను, అన్నోజిగూడలోని జడ్పీహైస్కూల్‌లోని మూత్రశాలలను, మరుగుదొడ్లను పరిశీలించారు. ఈసందర్భంగా విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచి యాదాద్రి పార్కును పరిశీలించారు. అనంతరం నారపల్లిలోని జంతుకుటుంబ నియంత్రణ కేంద్రాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి, కమిషనర్ వేమనరెడ్డి, జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం స్వరూప రాణి, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తాం



ప్రొసీడింగ్ అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కడ్తాల్ , ఆగస్టు 6: కడ్తాలలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు భవనాలు నిర్మిస్తామని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. అసంపూర్తి భవనాల నిర్మాణాలు పూర్తిచేసి వినియోగంలోకి తెస్తామని చెప్పారు. కడ్తాలలో మంగళవారం ఎమ్మెల్యే పర్యటించారు. కడ్తాలలో నిర్మిస్తున్న తహసీల్దార్ కార్యాలయానికి రహదారి నుంచి సీసీ రోడ్డుకు రూ.25లక్షలు కేటాయిస్తూ ప్రొసీడింగ్‌ను నాయకులకు అందజేశారు. భవనాన్ని త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. మహిళా సమాఖ్య భవనం పనులను ప్రారంభిస్తామని తెలిపారు. ఆసుపత్రి, జూనియర్ కళాశాల, బస్టాండ్ ఏర్పాటుపై సీఎం దృష్టికి తీసుకుపోతానని చెప్పారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీపీ కమ్లీ మోత్యనాయక్, నాయకులు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, బీక్యనాయక్, యాట నర్సింహ, బిచ్యానాయక్, శ్రీనివాస్, వెంకటేశ్, తహసీల్దార్ ముంతాజ్, ఎంపీడీవో సుజాత, స్పెషల్ ఆఫీసర్ రామేశ్వరి, సీఐ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో పల్వాన్‌కుమార్

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి

డీఎంహెచ్‌వో పల్వన్‌కుమార్

దోమ, ఆగస్టు 6: వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో అధికారులకు సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలో మంగళవారం క్యాన్సర్‌కు సంబంధించిన వ్యాధులపై పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారు. మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఆస్పత్రికి వచ్చే రోగుల పట్ల సిబ్బంది శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు జీవరాజ్, హనుమంతరావు, మహేశ్‌బాబు, సోమలింగం, వైద్యాధికారులు రజిత, నిరోష, నేహ, పవిత్ర, ప్రవీణ్, విజయలక్ష్మి, ప్రభులింగం, రేణు కుమార్, పంచాయతీ కార్యదర్శులు చంద్రశేఖర్, వాణి, ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

వీధి వ్యాపారులకు షెడ్లు

తాండూరు మున్సిపాలిటీకి 25 మంజూరు

రూ.9.50లక్షలు కేటాయింపు ● స్థల అన్వేషణలో మెప్మా సిబ్బంది



షెడ్ల మోడల్

తాండూరు, ఆగస్టు 6: వీధి వ్యాపారులకు చేయూతనిచ్చే కార్యక్రమాలకు మెప్మా ప్రాజెక్టు శ్రీకారం చుట్టింది. వీధి వ్యాపారులు రోడ్లపై అమ్మకాలు చేయొద్దనే ఉద్దేశంతో షెడ్లను నిర్మించాలని నిర్ణయించింది. ఈ మేరకు వికారాబాద్ జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలలో మొదటగా తాండూరు మున్సిపాలిటీని ఎంపిక చేసింది. వ్యాపార కేంద్రంగా ఉన్న తాండూరులో ముందుగా చేపట్టి తర్వాత లోటు పాట్లను సవరించిన తర్వాత ఇతర మున్సిపాలిటీల్లో చేపట్టనున్నారు. తాండూరు మున్సిపాలిటీలో 25షెడ్ల నిర్మాణానికి రూ.9లక్షల 50 వేలు మంజూరయ్యాయి. 50శాతం నిధులు రూ.4లక్షల 75వేలు నిధులను అడ్వాన్స్‌గా మెప్మా అకౌంట్‌లోకి రాష్ట్ర ప్రాజెక్టు అధికారులు జమ చేశారు. తాండూరు మున్సిపాలిటీలో పాత మున్సిపాలిటీ ముందుకు షెడ్లు నిర్మించాలని మెప్మా జిల్లా అధికారులు ఈ స్థలాన్ని పరిశీలించారు. అక్కడ కాకుండా మరోస్థలాన్ని ఎంపిక చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ మెప్మా సిబ్బందికి సూచించినట్లు సమాచారం. తెలంగాణ స్ట్రీట్ వెండింగ్ స్కీం-2016 కింద పట్టణ ప్రగతి ప్రోగ్రాం కింద ఈ షెడ్ల నిర్మాణాన్ని చేపడుతున్నారు. స్ట్రీట్ వెండర్స్ జోన్ల ఎంపికలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ఒక్కొక్క షెడ్డు 6.6ఫీట్లు, ఎత్తు 10ఫీట్లు, ప్లాట్ ఫామ్ రెండు ఫీట్లు, అండర్ గ్రౌండ్ బేస్‌మెంట్ మూడు ఫీట్లు, ఒక్కరు ఎస్ఎఫ్‌టీకి రూ.848ఖర్చవుతుందని అంచనా వేశారు.

భూములివ్వాలని ఒత్తిడి చేస్తే ఊరుకోం



కుర్మిద్దలో రైతులతో మాట్లాడుతున్న సరస్వతి

యాచారం, ఆగస్టు 6: భూములివ్వాలని రెవెన్యూ అధికారులు రైతులకు ఫోన్‌లు చేసి ఇబ్బంది పెడుతున్నారని, ఇది మంచిది కాదని ప్రముఖ పర్యావరణ వేత్త కవుల సరస్వతి పేర్కొన్నారు. రైతుల జోలికొస్తే తాము ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు. కాంగ్రెస్ నాయకులు ప్రజలకిచ్చిన మాటమీద నిలబడాలన్నారు. మళ్లీ భూములను తీసుకునేందుకు యత్నించడం సరికాదన్నారు. మంగళవారం కుర్మిద్దలో నిర్వాసితులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. 2,500 ఎకరాల సర్వే నంబర్లను ధరణి పోర్టల్‌లో టీఎస్ఐఐసీ పేరిట నమోదు చేయడంతో రైతులకు ప్రభుత్వాల పథకాలేవీ రావడం లేదన్నారు. తాము అధికారంలోకి వస్తే పట్టా భూములను నిషేధిత జాబితా నుంచి తొలగిస్తామని నాయకులు హామీ ఇచ్చారన్నారు. నిషేధిత జాబితా నుంచి వెంటనే భూములను తొలగించకుంటే ఉద్యమం లేవదీస్తామన్నారు. అసలు ఫార్మాసిటీని రద్దు చేశారా? లేదా? అనే దానిపై స్పష్టత ఇవ్వాలన్నారు. రెవన్యూ అధికారులు రైతులపై ఒత్తిడి తేకుండా కాంగ్రెస్ నాయకులు చర్యలు తీసుకోవాలని కోరారు.

సునీత కుటుంబానికి న్యాయం చేయాలి



నిరసన ర్యాలీలో విశారదన్

షాద్‌నగర్, ఆగస్టు 6 : చోరీ కేసులో అరెస్టు చేసి థర్డ్ డిగ్రీతో చిత్రహింసలకు గురిచేసిన సునీత అనే దళిత మహిళ కుటుంబానికి న్యాయం చేయాలని ధర్మ సమాజ్ పార్టీ డిమాండ్ చేసింది. మంగళవారం డీఎస్‌పీ అధ్యక్షుడు విశారదన్ మహరాజ్ షాద్‌నగర్‌లో సునీతను పరామర్శించారు. అనంతరం కార్యకర్తలతో ప్రధాన కూడలికి చేరుకొని అంబేడ్కర్ విగ్రహం వద్ద దీక్ష చేశారు. మహిళపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన డీఐ రామిరెడ్డిని డిస్మిస్ చేయాలని డిమాండ్ చేశారు. బాధితురాలికి న్యాయం చేయకుంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. విశారదన్ పట్టణ ప్రధాన కూడలిలో చేపట్టిన ఆకస్మిక దీక్షతో గంటన్నర పాటు ట్రాఫిక్ స్తంభించింది.

'నాగేందర్ కుటుంబానికీ న్యాయం చేయండి'

బంగారం, నగదు అపహరణకు గురైన నాగేందర్ కుటుంబానికి కూడా న్యాయం చేయాలని నిజ నిర్ధారణ కమిటీ డిమాండ్ చేసింది. మంగళవారం షాద్‌నగర్ అంబేడ్కర్ కాలనీలో ఉంటున్న నాగేందర్ ఇంటికి చేరుకుని వాస్తవాలను సేకరించింది. కమిటీ సభ్యులు పి.రఘు మాట్లాడుతూ.. సునీతను పోలీసులు కొట్టడాన్ని తాము కూడా వ్యతిరేకిస్తున్నామన్నారు. అదే సందర్భంలో నాగేందర్ ఇంట్లో చోరీకి అయిన బంగారం, నగదును పోలీసులు స్వాధీనం చేసుకుని బాధిత కుటుంబానికి అందజేయాలని డిమాండ్ చేశారు. రెండు కుటుంబాలకు న్యాయం చేయాల్సిన బాధ్యత రాజకీయ పార్టీలపై ఉందన్నారు. సునీతను పరామర్శించేందుకు వచ్చిన బీఆర్ఎస్ నేతలు అసెంబ్లీలో జరిగిన విషయాలను ఇక్కడ మాట్లాడం సిగ్గుచేటన్నారు. రాజకీయ లబ్ధికోసమే వారు సునీతను పరామర్శించారని విమర్శించారు. కమిటీ మరో సభ్యుడు జగన్ మాట్లాడుతూ ఒక పద్ధతి ప్రకారం జరగాల్సిన విచారణను బీఆర్ఎస్ పక్కదారి పట్టిచ్చిందని అన్నారు.

పిల్లల ఎదుట తల్లిదండ్రులు ఫోన్లు వాడొద్దు



కొడంగల్, ఆగస్టు 6: పిల్లలు ఉన్నప్పుడు తల్లిదండ్రులు సెలఫోన్‌లకు దూరంగా ఉండాలని ఆర్యజనని నిర్వాహకులు డాక్టర్ అనుపమరెడ్డి సూచించారు. కొడంగల్ రాఘవేంద్ర ఫంక్షన్ హాల్‌లో మంగళవారం రామకృష్ణ మఠం ఆర్యజనని ఆధ్వర్యంలో గర్భిణులకు సలహాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ముద్దప్పదేశ్‌ముఖ్, వైద్యులు దానప్పయాదవ్, రవీంద్రయాదవ్, చంద్రశేఖర్, టీవీవీ నాయకులు రవీందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఇక సర్కారు వారి ఇసుక

- మారిన ఇసుక పాలసీ
- తాండూరు సెగ్మెంట్‌లో 7 రీచ్‌ల గుర్తింపు
- బలహీన వర్గాల ఇళ్ల నిర్మాణానికి ఇసుక ఫ్రీ
- ఇక అక్రమ రవాణాకు చెక్



తాండూరు/బషీరాబాద్, ఆగస్టు 6: సర్కారు నిర్ణయించిన ధరకే ఇసుక లభించనుంది. ప్రస్తుతమున్న ఇసుక విధానంలో మార్పులు చేస్తూ వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ మార్గదర్శకాలను జారీచేశారు. గతనెల 12న తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి కలెక్టర్‌ను కలిసి తాండూరు ప్రాంతంలో సొంతంగా ఎవరికైనా భవన నిర్మాణాలకు ఇసుక అవసరమైతే వేగంగా, సులభంగా ఇసుక అందుబాటులో ఉండేవిధంగా తహసీల్దార్లకు సూచించాలని కోరిన విషయం తెలిసిందే. దీంతో ఇసుక పాలసీలో సవరణ చేస్తూ ఇసుక అందుబాటులో ఉండేలా మార్గదర్శకాలను ఇచ్చారు. ఈ బాధ్యతను మండలాల్లో తహసీల్దార్లకు, మున్సిపాలిటీల్లో కమిషనర్లకు పర్యవేక్షణ బాధ్యతలను అప్పగించారు. ఇసుక తీసుకెళ్లడానికి సరళతరం చేస్తూనే మరోవైపు అక్రమ ఇసుకరవాణా నియంత్రణకు చర్యలు తీసుకునేలా మార్గదర్శకాల్లో పేర్కొన్నారు.

తక్కువ ధర.. బలహీనవర్గాల వారికి ఫ్రీ

బలహీన వర్గాల ఇళ్ల నిర్మాణానికి, ప్రభుత్వ పథకాలకు ఇసుకధర లేకుండా, రాయల్టీ, ఇతర చట్టపరమైన మొత్తం చెల్లింపుపై ఉచితంగా ఇసుకను తీసుకెళ్లేందుకు అనుమతించ బడుతుంది. స్థానిక గృహావసరాలకు ప్రభుత్వ పనులకు ఇసుక సరఫరా ప్రాధాన్యత ఇవ్వాలి. ఇసుక విక్రయ ధర రూ.200 లేదా ఒక ట్రాక్టర్ లోడ్‌కు రూ.600 చెల్లించాలి. ఒక రాయల్టీ-120, డీఎంఫ్-36, ఎస్ఎంఈటీ-24, సీటి పన్ను-24, అమ్మకం పన్ను-120, మొత్తం-330లు చెల్లించాల్సి ఉంటుంది. డీడీ రూపంలో కలెక్టర్ వికారాబాద్ పేరిట డీడీ ఇవ్వాలి.

అక్రమ రవాణా, నియంత్రణకు చర్యలు

ఇసుక వెలికితీత, అక్రమ రవాణాను నియంత్రించడానికి కార్యాచరణ మార్గదర్శకాలను జారీ చేశారు. సరైన పరిపాలన యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలి. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శి, మున్సిపాలిటీలో స్థానిక అధికారులకు పర్యవేక్షణకు నియమించాలి. ఇసుక రవాణాకు సంబంధించి ప్రాజెక్టు పని, డిపార్ట్‌మెంట్ పేరు, ప్రాజెక్టు స్థానం, వివరాలను పేర్కొంటూ వేబిల్లు జారీచేయాలి. వేబిల్లును సూపర్‌వైజర్ ధ్రువీకరించాలి. ట్రాక్టర్లు మాత్రమే రవాణాకు అనుమతించబడుతాయి. పోలీసు, రవాణాశాఖ యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలి. నిర్దిష్ట నిర్మాణ పనుల స్థలంలో మరెక్కడా ఇసుక నిల్వ చేయరాదు. ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకే రవాణా సమయం, చెక్ పాయింట్లు ఏర్పాటుచేసి యంత్రాంగాన్ని నియమించాలి. ట్రాకర్ల వివరాలను తహసీల్దార్‌కు అందజేయాలి. రూ.25వేల నుంచి రూ.50వేల వరకు సెక్యూరిటీ డిపాజిట్‌ను పెట్టాలి. నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాతో పాటు ఈ మొత్తాన్ని జమ చేస్తారు. ఇసుక వెలికితీత, లోడింగ్ పాయింట్ వద్ద పంచాయతీ కార్యదర్శి రిజిష్టర్‌ను నిర్వహించాలి. వారానికోసారి వివరాలను తహసీల్దార్‌కు అందజేయాలి. తహసీల్దార్ ఆ వివరాలను కలెక్టర్‌కు నివేదించాలి. ఇసుక వెలికితీత(రీచ్) వద్ద కూలీల మాస్టర్ రోల్ నిర్వహణతో పాటు అట్టి వేతనాన్ని బ్యాంకు అకౌంట్ ద్వారా చెల్లించాలి. స్వాధీ నం చేసుకున్న ఇసుకను విక్రయధర, చట్టబద్ధమైన మొత్తాలను చెల్లించిన వారికి అందజేయాలి.

ఏడు రీచ్‌ల గుర్తింపు

వికారాబాద్ జిల్లాస్థాయి కమిటీ కాగ్నానది పరివాహక ప్రాంతంలోని ఏడు ఇసుక రీచ్‌లను గుర్తించింది. మొత్తం 90,384 క్యూబిక్ మీటర్ల (సీబీఎం) ఇసుక మాత్రమే తవ్వాలని స్పష్టమైన ఆదేశాలిచ్చారు. బషీరాబాద్ మండలం నవాంద్గిలో 14,720 సీబీఎం, గంగ్వార్‌లో 19,610 సీబీఎం, తాండూరు మండలం 19,920 సీబీఎం, పెద్దేముల్ మండలం రేగోండిలో 3003 సీబీఎం, కొండాపూర్‌లో 3315 సీబీఎంల ఇసుక తవ్వకాలకు అనుమతిచ్చారు. ఇంతకంటే ఎక్కువ తవ్వకాలు జరిపితే అధికారులపై చర్యలుంటాయని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు.

రూ.25లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

షాద్‌నగర్, ఆగస్టు 6: రాష్ట్రంలోనే షాద్‌నగర్ మున్సిపాల్టీని ఆదర్శ మున్సిపాల్టీగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మంగళవారం పట్టణ మున్సిపల్ పరిధిలోని రతన్ కాలనీ, అంజయ్య కాలనీలో రూ.25లక్షలతో చేపట్టబోయే రోడ్లు, ఓపెన్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలోని అన్ని వార్డుల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కె.నరేందర్, కౌన్సిలర్ సరితాయాదవ్, మాజీ చైర్మన్ అగ్గనూరి విశ్వం తదితరులు పాల్గొన్నారు.

డీటీవోను కలిసిన ఎస్టీయూటీఎస్ నాయకులు



డీటీవో పద్మావతిని కలిసిన ఎస్టీయూటీఎస్ నాయకులు

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 6: జిల్లా ట్రెజరీ ఆఫీసర్‌గా కలెక్టరేట్‌లో నూతనంగా బాధ్యతలు తీసుకున్న పద్మావతిని మంగళవారం రాష్ట్రోపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి.ప్రవీణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి సత్తు పాండురంగారెడ్డిలు మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో పండిట్, పీఈటీ పోస్టుల ఉన్నతీకరణ, అప్ గ్రేడ్‌కు సంబంధించి క్యాడర్ స్ట్రెంత్ సమాచారం సబ్‌ట్రెజరీ అధికారులకు అందించాల్సిందిగా వారు ఆమెను కోరారు. స్పందించిన ఆమె సమాచారం అందిస్తామని తెలిపారు. వీరి వెంట ఎస్టీయూటీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, నాయకులు సుధాకర్, రాజమణి, పరమేశ్, భాస్కర్ ఉన్నారు.

టెండర్ల జాప్యం ఇంకెంతకాలం?

- దుకాణాల కేటాయింపునకు గడువు ముగిసినా చోద్యం
- మూడు నెలలుగా టెండర్లు పిలవని వైనం
- అధికారపక్షం జోక్యంతో ఆలస్యం
- లోలోపల కేటాయింపునకు లాబీయింగ్



పరిగిలో మున్సిపాలిటీకి చెందిన దుకాణాలు

పరిగి, ఆగస్టు 6: పరిగి పట్టణంలో గల మున్సిపల్ శాఖ చెందిన వాణిజ్య సముదాయం దుకాణాల కేటాయింపులో నిబంధనలకు పాతరేస్తున్నారు. గతంలో కేటాయించిన దుకాణాల గడువు ముగిసినా రీటెండర్ వేయకుండా కాలం వెల్లదీస్తున్నారు. దుకాణాల్లో ఏళ్లగా తిష్టవేసిన వ్యాపారులు పాలకులు, అధికారులను ప్రభావితం చేస్తున్నారు. అధికారులు, పాలకులు కూడా నిబంధనలకు విరుద్ధంగా లోలోపల అనర్హులకు కేటాయిస్తున్నారు. వాస్తవానికి ప్రభుత్వ దుకాణాలను చదువుకున్న నిరుద్యోగులకు ఉపాధి పొందేందుకు కేటాయించాల్సి ఉంటుంది. అయితే అధికారులు మాత్రం టెండర్‌లో ఎవరు ఎక్కువ అంటే వారికే కేటాయిస్తున్నారు. పరిగి మునిసిపాలిటీకి 27దుకాణాలు ఉన్నాయి. ఈ దుకాణాలు కూడా ఆర్టీసీ బస్టాండ్ దగ్గర హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై ఉండడంతో మంచి డిమాండ్ ఉంటుంది. అయితే గతంలో టెండర్ ద్వారా కేటాయించిన దుకాణాల గడువు గత ఏప్రిల్ చివరినాటికి ముగిసింది. తిరిగి టెండర్ వేయాల్సి ఉంది. గడువు ముగిసి మూడునెలలు గడిసినా టెండర్ల గురించి అధికారులు ఎలాంటి చర్యలు తీసుకకోవడం లేదని పట్టణ ప్రజలు చెబుతున్నారు. అయితే నాయకులు, అధికారులు కలిసి లోలోపల తమకు అనుకూలంగా ఉన్నవారికి కేటాయించేందుకు టెండర్లు వేయడంలేదని చెబుతున్నారు. టెండర్ల ప్రక్రియ వేయకపోవడంలో పాలకవర్గంతో పాటు, అధికార పార్టీ ప్రజాప్రతినిధి కూడా దుకాణాల కేటాయింపులో జోక్యం చేసుకుంటున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నారు. అయితే ఇలా రాజకీయ జోక్యంతో వారికి ఇష్టం వచ్చినవారికి కేటాయించాలని లోలోపల మాట్లాడుకుంటున్నారని వాపోతున్నారు. దుకాణాల కేటాయింపులో అధికారులు కూడా రాజకీయ ఒత్తిళ్లతో ఏం చేయలేక పోతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దుకాణాలను నిరుద్యోగులకు కేటాయించాలని స్థానికులు కోరుతున్నారు.

ఓపెన్ టెండర్ పెట్టాలి



మునిసిపల్‌కు చెందిన దుకాణాలకు ఓపెన్ టెండర్ వేయాలి. గడువు ముగిసి మూడు నెలలు గడిచినా అధికారులు పట్టించుకోవడం లేదు. వెంటనే టెండర్లు వేసి జనాభా ప్రతిపాదికన అర్హులకు కేటాయించాలి. నిరుద్యోగులకు కేటాయిస్తే స్వయంఉపాధి పొందుతారు. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలి.

- ఎం.వెంకటయ్య, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు

జ్యూరిడిక్షన్ విలువ తగ్గించొద్దు



ఆర్డీవో సూరజ్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

ఆమనగల్లు, ఆగస్టు 6: ప్రభుత్వం జూనియర్ సివిల్ జడ్జి కోర్టు పరిధి జ్యూరిడిక్షన్ స్థాయిని రూ.20లక్షల నుంచి రూ.10లక్షలకు తగ్గించడం సరికాదని ఆమనగల్లు బార్ అసోషియేషన్ సభ్యులు అన్నారు. మంగళవారం ఆమనగల్లు కోర్టు వద్ద నిరసన తెలిపారు. ప్రభుత్వం సవరణలను వెంటనే ఉపసంహరించుకుని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు స్థాయిని యథావిధిగా ఉంచాలని డిమాండ్ చేశారు. బార్ అసోషియేషన్ సభ్యులు ఆర్డీవో సూరజ్‌కుమార్, ఆమనగల్లు తహసీల్దార్ లలితలకు బార్ అసోషియేషన్ అధ్యక్షుడు మల్లేపల్లి జగన్, ప్రధాన కార్యదర్శి అంజనేయులు, న్యాయవాది యాదీలాల్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. న్యాయవాదులు రామకృష్ణ, మధు, శేఖర్, కృష్ణ, మల్లేశ్, గణేశ్, సంతోష్‌కుమార్, దేవేందర్, జగన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఇదేం ఆసుపత్రి?

- కాలికి గాయమై వస్తే అయోడిన్ లేదంటారా..?
- బషీరాబాద్ సీహెచ్‌సీలో రైతును పట్టించుకోని వైద్య సిబ్బంది
- ఆందోళనకు దిగిన బాధితుడు



కాలిదెబ్బను చూపిస్తున్న కుర్వ కనకయ్య

బషీరాబాద్, ఆగస్టు 6: అయోడిన్ లేకుంటే గాయాలపాలైన వారికి ఏం చికిత్స చేస్తారంటూ బషీరాబాద్ (సీహెచ్‌సీ) కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు చికిత్స కోసం వచ్చిన ఓ బాధిత రైతు మంగళవారం ఆందోళనకు దిగారు. 15రోజుల కిందట ఆసుపత్రికి వస్తే తనను పట్టించుకోకపోతే తానే స్వయంగా కాలిదెబ్బకు డ్రెస్సింగ్ చేసుకుని వెళ్లానని తెలిపాడు. ఇప్పుడొస్తే అసలు అయోడిన్ లేదంటున్నారని, వైద్యులు అందుబాటులో లేకుంటే ఎవరికి చెప్పుకోవాలని వైద్యసిబ్బందిపై మండిపడ్డాడు. అంతలోనే హెడ్ నర్సు ఒకరు వచ్చి కాలికి గాయమై వచ్చిన జీవన్గికి చెందిన రైతు కూర్వ కనకయ్యకు అయింట్‌మెంట్ పూయించుకోమని సలహా ఇచ్చింది. ఇదిలా ఉండగా కొత్తగా వచ్చిన ఇద్దరు డాక్టర్లు ఎక్కడున్నారంటూ విలేకర్లు ఆరా తీయగా ఒకరు మధ్యాహ్న భోజనానికి వెళ్లారని, మరో డాక్టర్ ఆసుపత్రి పనిపై వెళ్లడంతో రాలేదని చెప్పుకొచ్చారు. అప్పటికే చికిత్స కోసం వచ్చి వేచి చూస్తున్నా కొందరు ఇంకెక్కడి డాక్టర్ 12గంటలకే ఒకరు వెళ్లిపోయారని గుసగుసలాడుకున్నారు. ఈ ఆసుపత్రి స్థాయి పెంచినా పేదలకు ఏం లాభంలేదని, వైద్యులు ఎవరూ సక్రమంగా ఉండరంటూ చికిత్స కోసం వచ్చిన బాధితులు ఆరోపించారు. మధ్యాహ్నం 2గంటల సమయంలో భోజనానికి వెళ్లి తిరిగి వచ్చిన ఆయూష్ డాక్టర్ సురేష్‌ను మిగతా ఇద్దరి వైద్యుల విషయమై అడగగా సమాధానం చెప్పకుండా మిన్నకుండిపోయారు. అప్పటికే చికిత్స కోసం వచ్చిన బాధితులు వైద్యుడిని చుట్టుముట్టడంతో అతడు వైద్యసేవలు అందిచడంలో మునిగిపోయారు. ఏదిఏమైనా ప్రస్తుతం ఈ ఆసుపత్రికి ఆయూష్ డాక్టర్ మాత్రమే పెద్దదిక్కుగా మారి వైద్య సేవలు అందిస్తున్నారని పలువురు చర్చించుకోవడం గమనార్హం.

సర్కారు భూమిలో ప్రైవేటు రోడ్డు



ప్రభుత్వ భూమిలో రియల్టర్లు వేసిన సీసీ రోడ్డు



అధికారులతో రియల్టర్లు, కాలనీవాసుల వాగ్వాదం

- తొలగించేందుకు వెళ్లిన అధికారులను అడ్డుకున్న రియల్టర్లు
- వెంచర్లలో తప్పిదాలను కప్పిపుచ్చుకునే ప్రయత్నం
- వాగ్వాదానికి దిగడంతో వెనుదిరిగిన అధికారులు

మేడ్చల్ టౌన్, ఆగస్టు 6: ప్రైవేట్ వెంచర్ల లబ్ధి కోసం ప్రభుత్వ స్థలంలో వేసిన సీసీరోడ్డును తొలగించడానికి వెళ్లిన అధికారులకు చేదు అనుభవం ఎదురైంది. జేసీబీ, పోలీసు బందోబస్తుతో మంగళవారం ఆ వెంచర్ వద్దకు వెళ్లిన రెవెన్యూ అధికారులను రియల్టర్లు, కొందరు స్థానికులు అడ్డుకుని వాగ్వాదానికి దిగారు. దీంతో అధికారులు ఉట్టిచేతులతో వెనుదిరిగారు. వివరాల్లోకి వెళ్తే.. మేడ్చల్ పట్టణం నుంచి కిష్టాపూర్ వెళ్లే రోడ్డు పక్కన ఉన్న ఓ వెంచర్‌కు రోడ్డు లేకపోవడంతో వారు దొంగ చాటుగా మేడ్చల్-కిష్టాపూర్ రోడ్డుకు ఆనుకుని ఉన్న సర్వే నంబర్ 145లోని ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసి నేరుగా ఆ వెంచర్ లోపలికి వెళ్లేలా తొలత తాత్కాలిక మార్గాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఇక అడిగే వారు లేరంటూ తర్వాత పక్కాగా సీసీ రోడ్డు వేసి వెంచర్‌కు ప్రధాన రోడ్డుకు కలిపేందుకు సిద్ధమయ్యారు. దీంతో పలువురు స్థానికులు రూ. కోట్ల విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలంటూ ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. స్పందించిన కలెక్టర్ వెంటనే విచారణ జరపడానికి ఆదేశించగా మంగళవారం రెవెన్యూ అధికారులు ఆ సీసీ రోడ్డును తొలగించటానికి వెళ్లారు. కాగా, తాము ప్రభుత్వస్థలాన్ని కబ్జా చేయలేదంటూ రియల్టర్లు కొంతమంది మద్దతుదారులతో కలిసి అధికారులను అడ్డుకున్నారు. రోడ్డు వేసిన స్థలం పక్కాగా ప్రభుత్వానిదే అంటూ రెవెన్యూ సిబ్బంది రియల్టర్లకు తెలిపినా వారు సర్వేచేసి రోడ్డును తొలగించాలన్నారు. కాగా సర్వే నంబర్ 145లోని ప్రభుత్వ స్థలంలో రోడ్డు వేశారన్న కచ్చితమైన ఆధారాలు ఉన్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపినా రియల్టర్లు వినకుండా జేసీబీకి అడ్డంగా పడుకున్నారు. కాగా వెంచర్ వద్ద రోడ్డు ఏర్పాటు చేసిన స్థలం ప్రభుత్వానిదని స్థానికులు కొందరు అనడం గమనార్హం. ఈ వెంచర్‌కు మేడ్చల్-కిష్టాపూర్ రోడ్డు నుంచి అప్రోచింగ్ రోడ్డు లేదన్న విషయం అందరికీ తెలిసిందని కాగా ప్లాట్లు విక్రయించిన రియల్టర్లు గతంలో అధికారులకు, స్థానిక ప్రజాప్రతినిధులకు ముడుపులు ఇచ్చి తాత్కాలిక మార్గం ఏర్పాటుచేసి అమాయకప్రజలకు ప్లాట్లు విక్రయించారని స్థానికులు ఆరోపించారు. దీనికి తోడు మేడ్చల్-కిష్టాపూర్‌కు రోడ్డువైపు ఉన్న కొన్ని ప్లాట్లు ప్రభుత్వ స్థలానికి ఆనుకుని ఉన్నట్లు స్థానికులు తెలిపారు. రియల్టర్లు కొంత మంది స్థానిక ప్రజాప్రతినిధుల అండదండలతో అమాయక ప్రజలను మోసం చేసి అప్రోచింగ్ రోడ్డు లేని వెంచర్ తయారు చేసి ప్లాట్లను విక్రయించి చివరికి ప్లాట్లు కొన్న వారిని సైతం మోసం చేశారంటూ కొందరు ఆరోపించారు. కోట్ల విలువున్న ప్రభుత్వస్థలాన్ని కాపాడాల్సిన అధికారులు, ప్రజాప్రతినిధులు ఎక్కడినుంచో వచ్చిన రియల్టర్లకు దాసోహం పలకటంతో ఉన్న కాస్త ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురవుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ప్లాట్లు కొన్న వారిని, ప్రభుత్వాన్ని మోసం చేసే ప్రయత్నం చేస్తున్నట్లు కొందరు ఆరోపిస్తున్నారు. అదేవిధంగా వెంచర్‌లోని కొన్ని ప్లాట్లు హెచ్ఎండీఏ ముసాయిదా ప్లాన్‌లో 100ఫీట్ల రోడ్డు ఏర్పాటు చేసినప్పటికీ అట్టి స్థలాన్ని ప్లాట్లుగా మార్చి విక్రయించారని కొందరు ఆరోపించారు. వెంచర్‌లో చేసిన తప్పిదాలను కప్పి పుచ్చుకోవడానికి రియల్టర్లు ప్రస్తుతం ప్రయత్నిస్తున్నట్లు స్థానికులు వాపోయారు.

స్థలాన్ని ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకునే వరకూ వదలం

ప్రభుత్వం స్థలాన్ని కబ్జా చేసి లేఅవుట్‌లో రోడ్డు చూపించి ప్లాట్లుగా విక్రయించిన రియల్టర్లపై చట్టపరంగా కచ్చితంగా చర్యలు తీసుకుంటాం. రోడ్డు వేసిన స్థలం కచ్చితంగా ప్రభుత్వ స్థలంగా మావద్ద ఆధారాలు ఉన్నాయి. ఆ రోడ్డును తొలగించడానికి మా సిబ్బంది వెళ్లారు. సర్వేచేసి ప్రభుత్వస్థలాన్ని తమ ఆధీనంలో తీసుకుంటాం. పాట్లు ఉన్న, రోడ్డు వేసిన స్థలాన్ని మాత్రం వదిలే ప్రసక్తి లేదు. ప్రభుత్వ స్థలాన్ని రోడ్డుగా చూసి ప్లాట్లు విక్రయించిన వారి పట్ల బాధితులు నేరుగా ఫిర్యాదు చేయవచ్చు.

- శైలజ, మేడ్చల్ తహసీల్దార్

మున్సిపాలిటీగా

మహేశ్వరం?

విలీనం కానున్న పలు పంచాయతీలు

జీవో ఇప్పించే ప్రయత్నంలో అధికార పార్టీ నాయకులు



మహేశ్వరం గ్రామ ముఖచిత్రం

మహేశ్వరం, ఆగస్టు 6: మహేశ్వరం, మండలంలోని సిరగిరిపురం, గంగారం, గంగారంతండా, మన్‌సాన్‌పల్లి, ఆకన్‌పల్లి, గట్టుపల్లి, ఉప్పుగడ్డతంగా, కొత్తతండా, కేసీతండా, డీజీతండా, ఎన్డీతం డా, కేటీ తండా, తుమ్మలూరు, మొహబత్‌నగర్ గ్రామాలను కలుపుకొని మహేశ్వరం కేంద్రంగా నూతన మున్సిపాలిటీ ఏర్పాటుకు ముమ్మర యత్నాలు సాగుతున్నాయి. మహేశ్వరం మండల కేం ద్రం, గ్రామాలు, తండాలు కలుపుకొని మొత్తం 20వేలకుపైగా జనా బా ఉంది. వచ్చే అక్టోబర్‌లో పంచాయతీ ఎన్నికలు, అనంతరం మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఎన్నికల కోడ్ రాకముందే మహేశ్వరాన్ని మున్సిపాలిటీగా చేసేందుకు మహేశ్వరం కాంగ్రెస్ ఇన్‌చార్జి కేఎల్లార్ సంబంధిత ఫైలును ఇప్పటికే ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్కకు అప్పగించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటన నుంచి రాగానే మున్సిపాలిటీగా ప్రకటిస్తూ ఫైలుపై సీఎం సంతకం చేసే అవకాశాలున్నాయని కేఎల్లార్ పేర్కొంటున్నారు. పంచాయతీలుగా ఉన్న పల్లెలు ఆ పిలుపులకు దూరమై మున్సిపల్ వార్డులు కానున్నాయి. మహేశ్వరం మున్సిపాలిటీగా మారనుందనే వార్తలు మహేశ్వరం వాసుల్లో ఆందోళనలు రేకెత్తిస్తున్నాయి. తుక్కుగూడ, రావిరాల, సర్దార్‌నగర్, మంఖాల్ గ్రామాలను కలుపుకొని ఐదేళ్ల కింద తుక్కుగూడ కేంద్రంగా మున్సిపాలిటీ ఏర్పడింది. అదే తరహాలో ఇప్పుడు మహేశ్వరాన్నీ మున్సిపాలిటీ చేయాలని కొందరు కాంగ్రెస్ నాయకులు కేఎల్లార్‌పై ఒత్తిడి చేస్తున్నారని అంటున్నారు. రియల్ ఎస్టేట్‌తో ఇప్పటికే గుర్తింపు పొందిన మహేశ్వరం మున్సిపాలిటీ అయి తే మరింత అభివృద్ధి సాధిస్తుందని కాంగ్రెస్ నాయకులు పాలకుల వద్ద ప్రతిపాదన పెట్టారనే వార్తలొచ్చాయి. మహేశ్వరాన్ని మున్సిపాలిటీగా ఏర్పాటు చేస్తూ జీవో ఇచ్చేలా అధికారులకు ఆదేశాలివ్వాలని ముఖ్యమంత్రితో మాట్లాడాలని స్థానిక నాయకులు కేఎల్లార్‌పై ఒత్తిడి తెచ్చారు. ఈ నేపథ్యంలో మహేశ్వరం త్వరలోనే మున్సిపపాలిటీగా అవతరించనుందనే వార్తలు జోరందుకున్నాయి.



షాద్‌నగర్ రూరల్: జయశంకర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శంకర్

ప్రొఫెసర్ జయశంకర్
ఆశయాల కోసం పని చేయాలి

షాద్‌నగర్ రూరల్/చేవెళ్ల/కేశంపేట/చౌదరిగూడ/కొందుర్గు/షాబాద్/కందుకూరు/ఆమనగల్లు/యాచారం/శంషాబాద్/ఇబ్రహీంపట్నం/మొయినాబాద్/శంషాబాద్ రూరల్, ఆగస్టు 6: తెలంగాణా సిద్ధాంత కర్త ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాల కోసం పనిచేసి రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుందామని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం ప్రొఫెసర్ జయశంకర్ జయంతి



ఇబ్రహీంపట్నంలో జయశంకర్ చిత్రపటానికి పూల మాలలువేసి నివాళ్లర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

వేడుకలను జరుపుకున్నారు. మండల పరిషత్ వద్ద ఉన్న జయశంకర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.ప్రజల ఆకాంక్షలు మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ జనార్దన్, సిద్ధార్థ, కరుణాకర్, నర్సింలు, రవీంద్రనాథ్, శివనాగయ్య, స్వరాజ్‌బాబు, బుచ్చయ్య, నాగరాజు పాల్గొన్నారు. తెలంగాణ చరిత్రలో ప్రొఫెసర్ జయశంకర్‌సార్ ఎప్పటికీ గుర్తుంటారని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో చేవెళ్లలో జయశంకర్ జయంతిని నిర్వహించారు. ఎమ్మెల్యే హాజరై జయశంకర్ విగ్రహానికి పూల మాల నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఉద్యమంలో జయశంకర్ పాత్ర మరువలేనిదని, తెలంగాణ సిద్ధాంతకర్తగా,ఉద్యమస్ఫూర్తి ప్రదాతగా ఆయన ప్రజల గుండెల్లో నిలిచిపోయారని చెప్పారు. కార్యక్రమంలో డీసీసీ మాజీ చైర్మన్ వెంకటస్వామి, నాయకులు సత్యనారాయణరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, వసంతం, మర్పల్లి మాలతికృష్ణారెడ్డి, శైలజాఆగిరెడ్డి, గుండాల రాములు, సమతవెంకటరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, వీరేందర్‌రెడ్డి, టేకులపల్లి శ్రీను, జనార్ధన్‌రెడ్డి, అనంతరెడ్డి, రేణుకాచారి, అవుసుల శ్రీనివాసాచారి, ఎ.శంభులింగాచారి, వి.శ్రీనివాసాచారి, వి.ఆనంద్‌చారి, వేణుగోపాలచారి, వడ్ల శ్రీనివాసచారి, పూజారి రాఘవేందర్‌చారి, విశ్వకర్మ సంఘం నాయకులు లింగాచారి, మోనాచారి, మాణిక్యచారి, యాదగిరిచారి,శేఖర్‌చారి, వీరాచారి, శ్రీశైలం, రాజు, మహేష్, పెంటయ్యచారి, బ్రహ్మచారి పాల్గొన్నారు. జయశంకర్ జయంతిని కేశంపేటలో నిర్వహించారు. తహసీల్దార్ ఆజం అలీ, ఎంపీడీవో రవిచంద్రకుమార్‌రెడ్డి, ఎస్సై రాజ్‌కుమార్, డాక్టర్ నిఖిత వారి కార్యాలయాల్లో జయశంకర్ చిత్రపటానికి నివాళ్లు అర్పించారు. ఆర్ఐ నివేదిత, సిబ్బంది మహేష్, శివలీల, శివ, జంగేష్, శ్రీనివాస్, ప్యాక్స్ వైస్ చైర్మన్ అంజిరెడ్డి పాల్గొన్నారు. జయశంకర్ జయంతిని జిల్లేడ్ చౌదరిగూడలో నిర్వహించారు. బస్టాండ్ ఆవరణలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సయ్యద్ హఫీజ్ జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసినివాళులర్పించారు. మండల పరిషత్‌లో ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ జయశంకర్ నివాళి అర్పించారు. నాయకులు బాబురావు, రాములు, వెంకటేష్, అక్రం, గణేష్, మోత్యానాయక్, నర్సింలు, అజ్మీరీ, ఆసిఫ్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. కొందుర్గులో జయశంకర్ జయంతి వేడుకలను బీఆర్ఎస్ నాయకులు నిర్వహించారు. జయశంకర్



ఆమనగల్లులో జయశంకర్ చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న రాంపాల్‌నాయక్, కమీషనర్ వసంత



చౌదరిగూడలో జయశంకర్ జయంతి వేడుకలు



కందుకూరు: నేదునూరు పాఠశాలలో జయశంకర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న టీచర్లు

సేవలను కొనియాడారు. తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో అధికారులు నివాళులర్పించారు. నాయకుడు శ్రీధర్ రెడ్డి, రామకృష్ణ, దర్గా రాంచంద్రయ్య, రవీందర్‌గౌడ్, ప్రేమ్ కుమార్, చంద్రశేఖర్, లింగం, చెన్నయ్య, శ్రీకాంత్, సత్యం, వెంకటరమణ పాల్గొన్నారు. జయశంకర్ ఆశయ సాధనకు కృషిచేయాలని అంగన్‌వాడీ టీచర్ విజయలక్ష్మి అన్నారు. షాబాద్ మండలం మక్తగూడ అంగన్‌వాడీ సెంటర్‌లో జయశంకర్ ఫొటోకు నివాళ్లు అర్పించారు. తెలంగాణ ఉద్యమానికి జీవితాన్ని అంకితమిచ్చిన మహనీయుడు జయశంకర్ అన్నారు. మహనీయుల్ని ఆదర్శంగా తీసుకోవాలని కందుకూరు మండలం నేదునూరు పాఠశాల హెచ్ఎం శ్రీనివాసశర్మ అన్నారు. జయశంకర్ జయంతి వేడుకలను జరుపుకున్నారు. కార్యక్రమంలో టీచర్లు వెంకటేశం, సురేష్, షెహరి, కృష్ణ, కరుణసాగర్, కౌసల్య, అబ్దుల్లా, బషీర్ పాల్గొన్నారు.

రాష్ట్ర చరిత్రలో జయశంకర్ చిరస్మరణీయులని ఆమనగల్లు మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్‌చైర్మన్ దుర్గయ్య అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ వసంత అధ్యక్షతన జయశంకర్ జయంతి వేడుకలు నిర్వహించారు. కౌన్సిలర్లు విజయ్, కృష్ణ, చెన్నకేశవులు, లక్ష్మణ్, కృష్ణ, శ్రీధర్, మున్సిపల్‌సిబ్బంది పాల్గొన్నారు. తలకొండపల్లి మండల పరిషత్‌లో జయశంకర్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఎంపీడీవో శ్రీకాంత్, ఎంపీవో రఘు పాల్గొన్నారు. జయశంకర్ ఆశయ సాధనకు యవత కృషిచేయాలని యాచారం ఎంపీడీవో నరేందర్‌రెడ్డి అన్నారు. మండల పరిషత్‌లో జయశంకర్ చిత్రపటానికి నివాళ్లర్పించారు. సూపరింటెండెంట్ శైలజ పాల్గొన్నారు. శంషాబాద్ మండల పరిషత్ వద్ద జయశంకర్ చిత్రపటానికి ఎంపీడీవో మున్నీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. మలి దశ తెలంగాణ ఉద్యమంలో జయశంకర్ పాత్రను ప్రజలు మరువరని బీఆర్ఎస్వీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పి.రాజ్‌కుమార్ అన్నారు. ఇబ్రహీంపట్నం చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులు ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చిలుకల బుగ్గ రాములు, ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, వినోద్, మహేష్, గరిగె శేఖర్, యాదగిరి, నగేష్ తదితరులు పాల్గొన్నారు. జయశంకర్ జయంతిని మొయినాబాద్‌లో ఘనంగా నిర్వహించారు విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో జయశంకర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో అన్నిగ్రామాల అధికారులు, పంచాయ తీ కార్యదర్శులు పాల్గొన్నారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు అనంతరెడ్డి, విశ్వకర్మ సంఘం అధ్యక్షుడు సంతోష్‌చారి, నర్సింహాచారి, కృష్ణమాచారి. రవిందర్‌చారి. శ్రీనివాస్‌చారి, చిన్నయ్యచారి పాల్గొన్నారు. జయశంకర్ జయంతి వేడుకలను శంషాబాద్ మండలంలో నిర్వహించారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దిద్యాల శ్రీనివాస్, మల్కారం పీఎస్‌సీఎస్ చైర్మన్ బుర్కుంట సతీష్ అధ్వర్యంలో మల్కారంలో పూల మాలవేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎస్సీ కమిషన్ మాజీ చైర్మన్ చిలకమర్రి నర్సింహ, గ్రామ కమిటీ అధ్యక్షుడు శ్రీకాంత్, రాజు, రాకేష్‌గౌడ్, రాఘవ, టి.రాజు, మధుచారి, శ్రీకాంత్ పాల్గొన్నారు.



శంషాబాద్‌లో జయశంకర్ జయంతిని నిర్వహిస్తున్న ఎంపీడీవో మున్ని, సిబ్బంది



చేవెళ్లలో జయశంకర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య తదితరులు

ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచిన జయశంకర్

రంగారెడ్డి అర్బన్: ప్రొఫెసర్ జయశంకర్ సార్ తెలంగాణ ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయారని తెలంగాణ పట్టణ, ఆర్థిక మౌళిక సదుపాయాల అభివృద్ధి సంస్థ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి అన్నారు. డీసీసీ కార్యాలయంతో పాటు తెలంగాణ పట్టణ, ఆర్థిక మౌళిక సదుపాయాల అభివృద్ధి సంస్థ కార్యాలయంలో జయశంకర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. జయశంకర్ ఆశయాల సాధనకు చిత్తశుద్ధితో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. రాష్ట్ర సాధనలో ఆయన చేసిన సూచనలు, సలహాలు భవిష్యత్ తరాలకు మార్గదర్శకాలుగా నిలుస్తాయన్నారు. సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని చూడకుండానే ఆయన మన మధ్య లేకుండా పోవడం బాధకరం అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



జయశంకర్ చిత్ర పటానికి పూలు సమర్పించి నివాళులు అర్పిస్తున్న చల్లా నర్సింహారెడ్డి

తల్లిపాలే శిశువుకు శ్రేయస్కరం

నందిగామ/యాచారం/కేశంపేట/చేవెళ్ల, ఆగస్టు 6: తల్లి పాలు పిల్లలకు శ్రేయస్కరమని, తల్లిబిడ్డల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే శంకర్ అన్నారు. నందిగామ మండలం చేగూర్‌లో ఐసీడీఎస్ అధికారి నాగమణి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. గర్భిణులు, పిల్లలకు ప్రభుత్వం పోషకాలతో కూడిన ఆహారాన్ని అందిస్తోందన్నారు. గర్భిణులు, బాలింతలకు కల్పిస్తున్న సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ప్రియాంకశివశంకర్‌గౌడ్, నర్సింలు, కొమ్ము క్రిష్ణ, చంద్రపాల్‌రెడ్డి, దేపల్లి కుమార్‌గౌడ్, బుచ్చయ్య, కావలి క్రిష్ణ, శివ, తుమ్మల నర్సింలు, శ్రావణ్, స్రవంతి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు. తల్లిపాలు శిశువుకు అమృతంతో సమానం అని జిల్లా సంక్షేమాధికారి పద్మజారమణి అన్నారు. తక్కళ్లపల్లి తండా అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ తులసి తదితరులున్నారు. తల్లి పాలతోనే బిడ్డకు ఆరోగ్యం చేకురుతుందని అంగన్‌వాడీ టీచర్లు సుమాళ్యమ్మ, శశికళ అన్నారు. కేశంపేట మండలం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. కాకునూర్‌లో మండల సెక్టార్ అంగన్‌వాడీ సూపర్‌వైజర్ దివ్యాసింగ్ తల్లిపా వారోత్సవాల్లో పాల్గొన్నారు. శిశువు ఆరోగ్యంగా ఎదగాలంటే తల్లులు విధిగా పాలు పట్టించాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమదేవి, అంగన్‌వాడీ టీచర్ మాధవి, మంజుల, కోడూరి రాములు, లింగం పాల్గొన్నారు. పుట్టిన గంటలోపు బిడ్డకు తల్లిపాలు తాపాలని చేవెళ్ల ఏవో తులసి అన్నారు. బస్తేపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను ఆమె ప్రారంభించారు. మాజీ సర్పంచ్ నర్సింలు, అంగన్‌వాడీ టీచర్ స్వప్న మహిళలు తదితరులు ఉన్నారు.

ప్రజా సమస్యలపై ఆట పాటలతో
ఎలుగెత్తి చాటిన గద్దర్

ఆమనగల్లు, ఆగస్టు 6: ప్రజాసమస్యలను తన గళం ద్వారా ఎలుగెత్తి అనాగారిణ వర్గాల అభ్యున్నతికి తన జీవితాంతం పరితపించిన మహనీయుడు గద్దర్ అని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. తన స్వరం ద్వారా కోట్లాది మందిలో పోరాట స్ఫూర్తిని నింపారన్నారు. ఆమనగల్లులో మంగళవారం అంబేడ్కర్ పూలే జ్ఞాన జాతర కమిటీ, దళిత ప్రజాసంఘాల ఆధ్వర్యంలో గద్దర్ ప్రథమ వర్ధంతి సభ, వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రజాసంఘాల రాష్ట్ర నాయకులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వస్పుల జంగయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరైనారు. పలు పార్టీల నేతలు, కళాకారులు, యువకులు, ప్రజాసంఘాల పాల్గొన్నారు. గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కళాకారులు నిర్వహించిన ఆటపాటలు అలరించాయి. సభలో కసిరెడ్డి మాట్లాడుతూ గద్దర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర సాధనలో ప్రజలను ఆయన ఉద్యమం వైపునడిపించిన తీరు మరవలేనిదన్నారు. గద్దర్ స్మారక స్థూపం, స్మృతి వనాన్ని ఏర్పాటు చేయాలని వస్పుల జంగయ్య ప్రభుత్వాన్ని కోరారు.



గద్దర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

స్వచ్ఛదనం-పచ్చదనంలో పాలు పంచుకోవాలి



ఇన్ముల్‌నర్వ ఉన్నత పాఠశాలలో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొత్తూర్/మహేశ్వరం/యాచారం/కేశంపేట/ఇబ్రహీంపట్నం/శంకర్‌పల్లి/ఆమనగల్లు/కడ్తాల/మొయినాబాద్/చేవెళ్ల, ఆగస్టు 6: స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో ప్రతీ ఒక్కరు పాలుపంచుకొని మొక్కలు నాటాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పిలుపునిచ్చారు. ఇన్ముల్‌నర్వ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే మొక్కలు నాటారు. కొత్తూర్ పారిశ్రామిక ప్రాంతం కావడంతో కాలుష్యం అధికంగా ఉంటుందని, కాలుష్యాన్ని తరిమికొట్టాలంటే ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో అరుంధతి, ప్రధానోపాధ్యాయుడు వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షు డు హరినాథ్‌రెడ్డి, నాయకులు లింగంనాయక్, రవికుమార్‌గుప్తా, బాబు, శ్రీకాంత్, మురళి, రవి, శంకర్, బిచ్యానాయక్, బాసునాయక్, హబీబ్, మహమూద్, షబ్బీర్ పాల్గొన్నారు. కొత్తూర్‌లో చైర్‌పర్సన్ బాతుక లావణ్యదేవేందర్‌యాదవ్ పాల్గొని పరిసరాల పరిశుభ్రతపై పర్యవేక్షించారు. స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో ప్రతీ ఒక్కరు పాలుపంచుకోవాలని జిల్లా పరిషత్ సీఈవో కృష్ణారెడ్డి అన్నారు. మహేశ్వరంలో ఆయన మొక్కలు నాటి పరిసరాల పరిశీలించారు. మొక్కలు పెంచి పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి శ్రీలక్ష్మి, ఎంపీడీవో శైలజ, ఎం ఈవో కృష్ణ, ఏపీఎం సత్యనారాయణ, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాని యాచారం ఎంపీడీవో నరేందర్‌రెడ్డి, ఎంపీవో శ్రీలత చెప్పారు. మాల్, చౌదర్‌పల్లిలో పర్యటించారు. చౌదర్‌పల్లిలో ఎంపీడీవో వాటర్ ట్యాంక్‌ను శుభ్రం చేయించారు. మాల్‌లో డంపింగ్ యార్డులో చెత్త సేకరణ అంశంపై పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కేశంపేట తహసీల్దార్ మీర్ ఆజం అలీ అన్నారు. సంతాపూర్‌లో ట్యాంకును క్లోరినేషన్ చేయించారు. ఎంపీడీవో రవిచంద్రకుమార్‌రెడ్డి గ్రామాల్లో కార్యక్రమాన్ని పరిశీలించారు. సంతాపూర్ మాజీ సర్పంచ్ ఆంజనేయులు, సాజిద్, పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో స్వచ్ఛమైన తాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని చైర్‌పర్సన్ స్రవంతి, కమిషనర్ రవీందర్‌సాగర్ అన్నారు. మున్సిపాలిటీలో 8 ఓహెచ్ఎస్ఆర్‌లు, మూడు సంపులను శుభ్రంచేయించారు. వైస్ చైర్మన్ బర్ల మంగ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. చెట్లతో పర్యావరణ పరిరక్షణ సాధ్యం అని చెవేళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. శంకర్‌పల్లి మండలం ఎల్వర్తిలో డీపీవో సురేష్‌మోహన్‌తో కలిసి మొక్కలు నాటారు. డీఎల్‌పీవో సతీష్, ఎంపీడీఓ వెంకయ్యగౌడ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుదర్శన్, ఏపీఎం భీమయ్య, ఏపీవో నాగభూషణం, పంచాయితీ కార్యదర్శి జీవన్ పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ ఉద్యమ స్ఫూర్తితో మొక్కలు నాటాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆమనగల్లు మండలం చింతలపల్లిలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీఓ కుసుమమాధురి, తహసీల్దార్ లలిత, ఏపీవో మాధవరెడ్డి, ఏఈలు శరత్, వాగ్దేవి, ఏపీఎం వెంకట్‌రెడ్డి, ఆర్ఐ చెన్నకేశవులు, పంచాయతీ కార్యదర్శి పవన్‌కుమార్, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, కేశవులు, నర్సింహ, విజయ్, శ్రీనివాస్‌రెడ్డి, మల్లయ్య, కేశవులు, వస్పుల జంగయ్య, ఖాదర్ ఖాద్రి, విజయ్‌రాథోడ్, జగన్, మానయ్య, కుమార్, మల్లయ్య పాల్గొన్నారు. కడ్తాలలో ఎమ్మెల్యే అధికారులతో కలిసి మొక్కలు నాటారు. పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీపీ కమ్లీ, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, బీక్యనాయక్, నర్సింహ, బిచ్యనాయక్, శ్రీనివాస్, చేగూరి వెంకటేశ్, తహసీల్దార్ ముంతాజ్, ఎంపీడీఓ సుజాత, స్పెషల్ ఆఫీసర్ రామేశ్వరి, సీఐ శివ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు. స్వచ్ఛదనం-పచ్చదనంలో భాగంగా మొయినాబాద్ మండలం గ్రామాల్లో పారిశుధ్యకార్యక్రమాలు నిర్వహించారు. నీటి వనరులను పరిశీలించారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించుకోవాలని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య అన్నారు. చేవెళ్లలోని లక్ష్మీవేంకటేశ్వర స్వామి వారి పుష్కరిణి చుట్టు డీపీవో సురేష్‌మోహన్, డీఎల్‌పీవో సతీష్‌రెడ్డిలతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీవో హిమబిందు, తహసీల్దార్ కృష్ణయ్య, ప్రత్యేకాధికారి విజయలక్ష్మి, ఏఈ గీతశ్రావంతి, ప్యాక్స్ చైర్మన్లు సమతావెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు మధుసూదన్‌రెడ్డి, సున్నపు వసంతం, మాలతికృష్ణరెడ్డి, బండారి శైలజాఆగిరెడ్డి, వీరేందర్‌రెడ్డి, రాములు, జనార్ధన్, శ్రీనివాస్‌గౌడ్, రాములు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

'హామీల అమలుకు ఉద్యమిద్దాం'

కడ్తాల్, ఆగస్టు 6: ఎన్నికల ముందు కాంగ్రెస్ గీతకార్మికులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. కడ్తాల మండలం ముద్విన్‌లో మంగళవారం అమరుల యాదిలో గీతన్నల చైతన్యయాత్ర పేరిట అవగాహన సభ నిర్వహించారు. వెంకటేశ్వర్లు గీతకార్మికులు ఎదుర్కుంటున్న సమస్యలపై చర్చించి పలు తీర్మానాలు చేశారు. ఆగస్టు 6 నుంచి 18వరకు సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వరకు చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి సుధాకర్‌గౌడ్, నాయకులు సుధాకర్‌గౌడ్, పట్నం నర్సింహగౌడ్, కృష్ణయ్య, వెంకటేశ్, కానుగుల వెంకటయ్య, గుమ్మడి కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

'ఎస్సీ డిక్లరేషన్‌కు నిధులివ్వాలి'

చేవెళ్ల, ఆగస్టు 6 : కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో చేవెళ్లలో జరిగిన ఎస్సీ డిక్లరేషన్ సభలో ఇచ్చిన ప్రధాన హమీలను వెంటనే అమలు చేయాలని జిల్లా ఎస్సీ మోర్చా కార్యదర్శి అశోక్ డిమాండ్ చేశారు. మంగళవారం నిధులు కేటాయించాలని కోరుతూ చేవెళ్ల తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేసి తహసీల్దార్ కృష్ణయ్యకు వినతిప్రతం ఇచ్చారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి అనంత్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు కృష్ణగౌడ్, ఆంజేయులగౌడ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

'మధురాపురాన్ని అభివృద్ధి చేయాలి'

షాద్‌నగర్, ఆగస్టు 6: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మధురాపురం గ్రామాన్ని అన్ని విధాల అభివృద్ధి పర్చాలని గ్రామస్థులు కోరారు. ఈ మేరకు మంగళవారం షాద్‌నగర్ పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బాలరాజు గౌడ్, మాజీ ఎంపీటీసీ భార్గవరెడ్డి మాట్లాడుతూ గ్రామాభివృద్ధి కోసం గ్రామంలో రోడ్లు, మౌలికసదుపాయాలు, ప్రభుత్వ భవనాలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రధానంగా కమ్మదనం గ్రామం నుంచి మధురాపురం, మధురాపురం గ్రామం నుంచి హెమాజీపూర్ వరకు రోడ్ల నిర్మాణం చేపట్టాలని తెలిపారు. గ్రామ ప్రజలకు కొత్తగా ఇందిరమ్మ ఇండ్లు, పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు మధుసూధన్‌రెడ్డి, ఫుల్లారెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, హరీశ్వర్‌రెడ్డి, పాండు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

'పాత టైమ్ టేబుల్‌నే అమలు చేయాలి'

యాచారం, ఆగస్టు 6: ప్రాథమిక పాఠశాలల్లో పాత టైం టేబుల్‌నే కొనసాగించాలని, ఉపాధ్యాయులకు, విద్యార్థులకు తగిన వసతులు కల్పించాలని టీఆర్‌టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు గోవర్దన్‌యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన యాచారం, నల్లవెల్లి. చింతపట్ల, మాల్, మేడిపల్లి, గున్‌గల్, నందివనపర్తి పాఠశాలల్లో సమస్యలను తెలుసుకున్నారు.

పోస్టాఫీసు పథకాలను వినియోగించుకోవాలి

కొందుర్గు, ఆగస్టు, 6: పోస్టాఫీసు పథకాలను ప్రజలు వినియోగించుకోవాలని షాద్‌నగర్ పోస్టల్ సబ్ డివిజినల్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ కోరారు. మంగళవారం తంగళ్లపల్లి పంచాయితీ కార్యాలయం ఆవరణలో గ్రామస్థులకు పోస్టాఫీసు అందజేస్తున్న పథకాలపై అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ సుకన్య సమృద్ధి యోజన, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, గ్రామీణ జీవిత బీమా యోజన పథకాల గురించి వివరించారు.

'ఉద్యోగుల సేవలు మరువలేనివి'

శంకర్‌పల్లి, ఆగస్టు 6 : ప్రజలకు సేవ చేసేందుకు పంచాయితీ కార్యదర్శులు కృషిచేయాలని శంకర్‌పల్లి ఎంపీడీఓ వెంకయ్యగౌడ్ అన్నారు. బదిలీ అయిన పంచాయతీ కార్యదర్శులు, ప్రమోషన్ పొందిన ఏఈ యుగేందర్, మాజీ జడ్పీటీసీ గోవిందమ్మ గోపాల్‌రెడ్డిలను మండల పరిషత్‌లో మంగళవారం సత్కరించారు.



క్రైం కార్నర్

రైలునుంచి పడి వ్యక్తి మృతి

షాద్‌నగర్ రూరల్ ఆగస్టు 6: నడుస్తున్న రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని యువకుడు మృతి చెందిన ఘటన బూర్గుల రైల్వేస్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి జరిగింది. మహబూబ్‌నగర్ రైల్వే ఎస్సై అక్బర్ తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 30 సంవత్సరాల వయస్సు కలిగిన యువకుబడు జారి పడి మృతిచెందినట్లు చెప్పారు. ప్యాంట్ జేబులో మద్యం సీసా ఉందన్నారు. వైట్ కలర్ ఫుల్‌షర్ట్, బనియన్, బ్లాక్ కలర్ జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నాడ న్నారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 9848090426లో సంప్రదించాలన్నారు.



మృతిచెందిన యువకుడు

ఉరేసుకొని వ్యక్తి యువకుడి ఆత్మహత్య

ఆదిభట్ల, ఆగస్టు 6:తండ్రి అనారోగ్యం, ఆర్థిక సమస్యలతో మానసిక వేదనకు గురైన ఓ యువకుడు ఉరేసుకున్నాడు. ఈ ఘటన ఆదిభట్ల పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. ఆదిభట్ల ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. నాదర్‌గుల్ పరిధి శాంతినగర్‌కాలనీలో ఉండే భద్రమోని సాయి రోహన్(18) అనే చదువు పూర్తిచేసి ఉద్యోగం కోసం చూస్తున్నాడు. గత ఏడాది తండ్రి కృష్ణ పక్షవాతం బారిన పడటంతో ఆస్పత్రి ఖర్చులతో అప్పులు పెరిగిపోయాయి. ఉద్యోగం లేక, తండ్రి అనారోగ్యంతో మానసిక వేదనకు గురైన సాయి రోహన్ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసున్నాడని ఎస్సై తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

హాస్టల్ నుంచి బాలుడి అదృశ్యం

ఆదిభట్ల, ఆగస్టు 6: హాస్టల్ నుంచి బయటకువెళ్లిన బాలుడు అదృశ్యమైన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఆదిభట్ల ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా పంగల్ మండలం మహందాపూర్‌నకు చెందిన యాటకిరి పరశురాములు తన కుమారుడు కిరణ్‌కుమార్(10)ను నాదర్‌గుల్‌లోని ఎస్టీ రెసిడెన్షియల్ స్కూల్లో ఐదో తరగతిలో చేర్పించాడు. 15రోజుల క్రితం అనారోగ్యం కారణంగా ఇంటికి వెళ్లి ఈ నెల 5న హాస్టల్‌కు తీసుకొచ్చాడు. కాగా మంగళవారం ఉదయం 11:30గంటలకు విరామ సమయంలో బాలుడు కిరణ్‌కుమార్ బయటకు వెళ్లి తిరిగిరాలేదు. దీంతో బాలుడు తప్పిపోయాడని ప్రిన్సిపాల్ బుక్యానాయక్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేసున్నట్లు ఎస్సై తెలిపారు.



కిరణ్‌కుమార్

గర్భిణీకి పెట్రోలింగ్ పోలీసుల అండ

● ప్రసవానంతరం ఆస్పత్రికి తరలింపు



ప్రసూతి ఆస్పత్రిలో చేరిన కుమీబాయి

మాడ్గుల/ఆదిభట్ల ఆగస్టు 6: ఇంట్లో నుంచి తప్పిపోయివచ్చి రాత్రి పూట పురిటి నొప్పులతో బాధపడ్డ నిండు గర్భిణీకి మాడ్గుల పోలీసులు రక్షణగా నిలిచారు. స్థానికుల సహకారంతో ఆమెకు ప్రసవం చేయించి తల్లీబిడ్డలను కోఠిలోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రికి తరలించిన ఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం రాత్రి 10గంటల సమయంలో మాడ్గుల రైతువేదిక వద్ద ఓ బాలుడితో మహిళ ఉన్నట్లు డయల్ 100కు స్థానికులు సమాచారం అందింది. పెట్రోలింగ్ కానిస్టేబుల్ రాజు, హోంగార్డ్ సురేష్ అక్కడికి చేరుకొని మహిళను వివరాల అడిగారు. తన పేరు కుమిబాయి అని, తనది కర్ణాటక రాష్ట్రం గుల్బర్గా జిల్లా చింఛోలి మండలం పోలెపల్లి అని తెలిపింది. ఆమె పురిటి నొప్పులతో బాధపడుతున్నట్లు గమనించిన పోలీసులు 108 సమాచారం ఇచ్చారు. అంబులెన్స్ వచ్చేలోపే స్థానిక మహిళల సహాయంతో నార్మల్ డెలివరీ జరిగింది. మహిళ వద్ద ఉన్న ఆధారాలతో అతడి సోదరుడు రాహుల్‌కు ఫోన్ చేశారు. 108లో కోఠిలోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రికి తరలించారు. కాగా గత నెల 29న తన కుమారుడు గణేష్, కూతురు గీతలతో కుమీబాయి తప్పిపోయిందని ఆమె భర్త కర్ణాటకలోని చించోలి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. కుమిబాయి ఎక్కడెక్కడో తిరిగి మాడ్గుల చేరింది. ఆమె తుమ్మడు హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నట్టు ఆమె తెలిపింది. రాత్రిపూట పురిటినొప్పులతో ఉన్న మహిళకు సాయం అందించి ఆస్పత్రికి చేర్చిన పోలీసులను స్థానికులు అభినందించారు.

ఇన్‌స్పెక్టర్‌కు డీజీపీ అభినందన

నందిగామ, అగస్టు 6: మండల పరిధి వెంకమ్మగూడలో 2022 మార్చి 1న భార్యను భర్త హత్యచేశాడు. లోకిరి బాల్‌రాజ్ తన భార్య సరితను చంపాడు. ఈ హత్య కేసులో నిందితుడికి యాజవజ్జీ జైలు శిక్ష పడింది. అప్పట్లో నందిగామ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించిన రామయ్య ఈ కేసులో క్రియాశీలకంగా వ్యవహరించారు. నిందితుడికి శిక్ష పడేలా చేసిన రామయ్యను ప్రభుత్వం అభినందించింది. మంగళవారం తెలంగాణ డీజీపీ జితేందర్ ప్రశంశాపత్రాన్ని అందజేశారు. రామయ్య ప్రస్తుతం హైదరాబాద్‌లోని బేగంపేట ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

వీరప్ప చెరువును పరిశీలించిన అధికారులు

చౌదరిగూడ, ఆగస్టు 6: మండల పరిధి లక్ష్మీదేవిపల్లి, ఎల్కగూడ గ్రామాల్లోని వీరప్ప చెరువును గ్రామస్థులతో కలిసి అధికారులు పరిశీలించారు. వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ సింధు, ఎంపీవో హన్మంత్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రవీందర్, టీఏ దేవుజా తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

● కందుకూరు: నిరుపేద కుటుంబసభ్యులు సీఎంఆర్‌ఎఫ్ ఫండ్ నిధులను సద్వినియోగం చేసుకోవాలని గుమ్మడవెల్లి మాజీ సర్పంచ్ గౌడర ప్రభాకర్ కోరారు. గుమ్మడవెల్లి తండాకు చెందిన సభావత్ సునీతకు మంజూరైన రూ.60వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును మంగళవారం బీజేపీ నేత గంగాపురం అమరేందర్‌రెడ్డితో కలిసి లబ్దిదారులకు అందజేశారు.

● షాబాద్: సీఎం సహాయనిధి నిరుపేదలకు వరంఅని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. క్యాంప్ కార్యాలయంలో మండలానికి చెందిన 33మందికి సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కును టీపీసీసీ ప్రధానకార్యదర్శి ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ షాబాద్ మండల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్‌లతో కలిసి అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు చెన్నయ్య, జయమ్మవెంకట్‌రెడ్డి, చేవెళ్ల స్వామి, ఖాజామియాపటేల్, రవీందర్‌నాయక్, మహేందర్‌గౌడ్, శేఖర్‌రెడ్డి, గౌరీశ్వర్, సుభాష్‌రెడ్డి, కిషోర్‌నాయక్, ప్రభాకర్ రెడ్డి, అంజనేయులు, జానీ, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

● చేవెళ్ల: ప్రజలకు సీఎం సహాయనిధి ఎంతో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే యాదయ్య అన్నారు. క్యాంప్ కార్యాలయంలో 188 మందికి రూ.67.5లక్షల విలువైన చెక్కులను అందించారు.విద్యార్థులు స్కూల్ యూనిఫామ్స్ విద్యార్థులకు అందజేశారు. డీపీవో సురేశ్‌మోహన్, ప్రిన్సిపాల్ శ్వేత, ఎంపీవో విఠలేశ్వర్, సీఐ భూపాల్ శ్రీధర్, ఉపాధ్యాయులు, నాయకులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

● షాబాద్: సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర గొప్పదని మాజీ సర్పంచ్ కవిత, సీనియర్ నాయకుడు ఒగ్గు మల్లయ్య అన్నారు. కేశవగూడ పాఠశాలలో గత 8 సంవత్సరాలుగా పనిచేసిన రవీందర్‌గౌడ్, రాజశేఖరరెడ్డి బదిలీపై వెళ్లడంతో గ్రామస్తులు వారిని ఘనంగా సన్మానించారు. అలాగే అంగన్‌వాడీ టీచర్ సరస్వతి రిటైర్ కాగా ఆమెను కూడా సన్మానించారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి రమేష్, స్కూల్ చైర్మన్ రమేష్, వెంకటయ్య, శ్రీశైలం, పెంటయ్య, మల్లయ్య పాల్గొన్నారు.

● కొందుర్గు: కేరళలోని వరద బాధితుల సహాయార్థం మండల కేంద్రంలోని దుకాణా యాజమానులు, వ్యాపారుల వద్ద సీపీఐ నాయకులు విరాళాలను సేకరించారు. భారీ వర్షాలకు వయనాడు ప్రాంతం వరదలకు గురైందని, మానవతా దృక్పథంతో విరాళాలలిచ్చి ఆదుకోవాలని కోరారు.

● కందుకూరు: అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్, రెవెన్యూ శాఖ మంత్రి శ్రీనివాస్‌రెడ్డిలను మాజీ జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, మాజీ ఎంపీపీ పల్స మహేష్‌గౌడ్ మంగళవారం ఘనంగా సన్మానించారు. నగరంలోని వారి నివాసానికి వెళ్లిన నాయకులు ఈ ప్రాంత అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు..

● షాద్‌నగర్: కాంగ్రెస్ ప్రభుత్వం దళితులకు వ్యతిరేకంగా వ్యవహరిస్తుందని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కొండేటి శ్రీధర్ విమర్శించారు. షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సునీతను ఆయన పరామర్శించారు. థర్డ్ ప్రయోగించిన పోలీసులను డిస్మిస్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పరామర్శించిన వారిలో రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, కొప్పు పాషా, బాబయ్య, శ్రీవర్ధన్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి ఉన్నారు.

● చౌదరిగూడ: ఫొటోగ్రఫీ రంగంలో వస్తున్న టెక్నాలజీని అందుకొని ఫొటోగ్రాఫర్లు ముందుకు సాగాలని ఫొటోగ్రాఫర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు శివలింగంగౌడ్ అన్నారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లేడ్ చౌదరిగూడకు చెందిన రాజేంద్రప్రసాద్‌కు సీనియర్ ఫొటోగ్రఫీ పురస్కారంతో పాటు షీల్డ్ అందజేశారు.

● షాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం పంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేసి, వారిని పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ అన్నారు. పంచాయతీ కార్మికులు ఈ నెల 8న రాష్ట్ర వ్యాప్తంగా విధులను బహిష్కరిస్తున్నట్లు షాబాద్ ఎంపీడీవో అపర్ణకు వినతి ప్రతం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ మండల ఉపాధ్యక్షుడు యాదయ్య, నాయకులు లక్ష్మయ్య, చంద్రయ్య, బాల్‌రాజ్ తదితరులు ఉన్నారు.

● మొయినాబాద్: ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయాన్ ఆసుపత్రి వైద్యులు సిద్దిక్, సమీఉల్లాఖాన్ తెలిపారు, కేతిరెడ్డిపల్లిలో వైద్యశిబిరం నిర్వహించారు. వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలుతెలియజేశారు.మాజీ ఎంపీటీసీ ఆర్.అర్చనయాదయ్య ఆధ్వర్యంలో వైద్యులు, రోగులకు భోజన ఏర్పాటు చేశారు. పంచాయతీ కార్యదర్శి తారాబాయి, ఎ.కృష్ణ, మహేందర్, నర్సింహారెడ్డి, సుధాకర్, మల్లేష్, వైద్య బృందం సభ్యులు పాల్గొన్నారు.

● చేవెళ్ల: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు తోడ్పాటు అందించడం అభినందనీయమని కేసారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శశికళ తెలిపారు. విద్యార్థులకు అంకిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బ్యాగులు, మ్యాట్లు పంపిణీ చేశారు. హెచ్ఎం మాట్లాడుతూ. అంకిత సంస్థ నిర్వాహకులు విద్యార్థులకు చేయూతనివ్వడం సంతోషకరమన్నారు. విద్యార్థులు బాగా చదువుకుని ఎదగాలని సూచించారు.